## మూడు రోజులపాటు మద్యంషాపులు మద్యం



హైదరాబాద్,నవంబర్4 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజులపాటు మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. ఈ నెలాఖరులో వరుసగా మూడు రోజులు పాటు 'డ్రై డే'గా పాటించనున్నారు. ఈ నెల 30 పోలింగ్ నిర్వహించనున్నారు. దీంతో ఆ రోజుతోపాటు నవంబర్ 28, 29 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని మద్యం దుకాణాలు, బార్లు మూసివేస్తారు. మళ్లీ డిసెంబర్ 1న వైన్ షాపులు తెరచుకోనున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మూడు రోజులపాటు మద్యం విక్రయాలు జరగకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. దీనికి సంబంధించి బార్లు, వైన్ షాపుల యజమానులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించింది..

## కాంగ్రెస్‌కు ఓటేస్తే బిజెపికి వేసినట్టే : ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ



సంగారెడ్డి, నవంబర్4 : పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటువేస్తే బీజేపీకి వేసినట్టేనని.. కాంగ్రెస్,బీజేపీ ఈ రెండు పార్టీలు ఒక్కటే అని ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. సంగారెడ్డి పట్టణంలో గురువారం రాత్రి నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ ఆర్ఎస్ఎస్ కన్నుసన్నుల్లో పనిచేస్తున్నట్లు ఆరోపించారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డిని ఓడించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో మైనార్టీలకు అన్నిరంగాల్లో సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని పేర్కొన్నారు. మజ్లిస్ పోటీచేయని చోట బీఆర్ఎస్‌కు ఓటే వేయాలని పిలుపునించారు.ఎంఐఎం అమ్ముడు పోతుందని రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి చాలామంది నేతలు బీజేపీలో చేరారని, వాళ్లు ఎంతకు అమ్ముడుపోయారని అసదుద్దీన్ ప్రశ్నించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్ని డబ్బులు తీసుకుని ఓడిపోయిందో చెప్పాలని ప్రశ్నించారు. జాతీయపార్టీలు అధికారంలో ఉన్నచోట శాంతిభద్రతల సమస్యలు వస్తున్నాయని, మైనార్టీల భద్రతను కాలరాస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో ప్రభుత్వం అన్నివర్గాలను సమానంగా చూస్తున్నదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని, బీఆర్ఎస్ పాలన బాగుందని అసదుద్దీన్ ప్రశంసించారు.

## కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న సిఎం కెసిఆర్

### ఆలయంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు



సిద్దిపేట,నవంబర్4 : బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్దిపేట జిల్లా కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వెంకన్న సన్నిధిలో నామినేషన్ పత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న సీఎం కేసీఆర్‌కు మంత్రి హరీశ్ రావు స్వాగతం పలుకగా, అర్చకులు మంగళ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రదక్షిణ చేసి.. వేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. పూజల అనంతరం వేదపండితులు ముఖ్యమంత్రికి తీర్థప్రసాదాలు అందిచారు. ఎన్నికల్లో నామినేషన్ వేసే ప్రతిసారి కేసీఆర్ ఈ ఆలయంలో పూజలు చేస్తూ వస్తున్నారు. ఈ నెల 9న గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలో నామినేషన్లు వేయనున్నారు. అదేరోజు బీఆర్ఎస్ ఆశీర్వాదసభల్లో పాల్గొననున్నారు. కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం సీఎం కేసీఆర్, పార్టీకి సెంటిమెంట్‌గా ఉంది. ఏ ఎన్నికలు వచ్చినా ఇక్క డ పూజలు చేసిన తర్వాతే సీఎం కేసీఆర్ నామినేషన్ వే స్తారు. సీఎం కేసీఆర్, హరీశ్‌రావు , ఇతర పార్టీ నేతలు ఎన్నికల సమయంలో వెంకన్నకు దర్శనం చేసుకొని స్వా మివారి సన్నిధిలో నామినేషన్ పత్రాలు ఉంచి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. కోనాయిపల్లి వెంకన్నకు పూజలు చేసిన ప్రతిసారి సీఎం కేసీఆర్ కేసీఆర్‌కు విజయం వరించింది. 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి 1989, 1994, 1999, 2001, 2004, 2009, 2014, 2018లో జరిగిన ఎన్నికల సమయంలో ఈ ఆలయంలో నామినేషన్ పత్రాలకు పూజలు చేసి, నామినేషన్ వేశారు. అన్ని సందర్భాల్లోనూ విజయం సాధించారు. మరో విశేషం ఏమిటంటే, 2001లో టీడీపీకి, శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసిన కేసీఆర్.. ఆ తర్వాత ఈ ఆలయంలోనే పూజలు చేసి టీఆర్ఎస్ పార్టీని ప్రకటించారు.

## అంబాసిడర్ కారులో వెళ్లి నామినేషన్ దాఖలు చేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడ,నవంబర్4 : బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ ఎన్నికల గుర్తు అయిన అంబాసిడర్ కారులో బాన్సువాడలోని రిటర్నింగ్ ఆఫీస్‌కు చేరుకున్న ఆయన తన తొలి సెట్ నామినేషన్‌ను సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తాను నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్నాని చెప్పారు. అందుకే 1994 నుంచి ఒక్కసారి మినహా ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధించానన్నారు. ప్రజల అభిమానం వల్లే ఇది సాధ్యమయిం దని చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన 7 గంటల కరెంట్ హామీని కూడా నెరవేర్చడం లేదని విమర్శించారు. మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణమని చెప్పారని.. తీరా గెలిచిన తర్వాత బస్సులను బంద్ చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిపెస్టో అద్భుతంగా ఉందని చెప్పారు. బీఆర్ఎస్ ఆమోద యోగ్యమైన, అమలు చేయదగిన మ్యానిఫెస్టో అన్నారు. బీఆర్ఎస్‌కు చాలా స్థానాల్లో పోటీయే లేదని సర్వేలు చెబుతున్నాయని తెలిపారు. తాము మూడోసారి అధికారంలోకి రావడం.. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవడం ఖాయ మన్నారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా తొలి రోజు 119 నియోజకవర్గాల్లో 100 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుంది. నవంబర్ 13న నామినేషన్ల పరిశీలన, 15న ఉపసంహరణ ఉంటాయని నోటిఫికేషన్‌లో ఎన్నికల సంఘం తెలిపింది.

## కార్యకర్తకు అంతిమ సంస్కారాలు నిర్వహించిన ఎమ్మెల్యే శంకర్ నాయక్

మహబూబాబాద్,నవంబర్4 : ఓ కార్యకర్త చనిపోతే ఆ ఎమ్మెల్యే చెలించి పోయాడు.. తన ప్రచార కార్యక్రమాలు నిలిపివేసి అంతిమ కార్యక్రమాలలో పాల్గొన్నారు. అంతిమయాత్రలో తానే స్వయంగా స్వర్గ రథం నడిపి చివరివరకు అంతిమ సంస్కారాలలో పాల్గొని రుణం తీర్చుకున్నారు. ఇంతకీ ఎవరా ఎమ్మెల్యే..? మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. గూడూరు మండలం పొనుగోడు సర్పంచ్ నలమాస వెంకన్న గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే తన ప్రచార కార్యక్రమాలు మొత్తం వాయిదా వేసుకొని పొనుగోడు గ్రామానికి వెళ్ళారు. తన పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే కార్యకర్త మరణాన్ని జీర్ణించుకోలేక తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అంతిమ యాత్ర కోసం ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే స్వయంగా నడిపాడు.

# జోష్ నింపుతున్న కెసిఆర్ ప్రసంగాలు

- ప్రతిపక్షాల ముచ్చెమటలు పట్టిస్తూ మాటల తూటలతో దాడి
- సిఎం కెసిఆర్ ప్రజా ఆశీర్వాద సభలతో పెరుగుతున్న బిఆర్ఎస్ గ్రాఫ్
- నేడు కొత్తగూడెంలో సిఎం కెసిఆర్ ప్రజా ఆశీర్వాద సభ



హైదరాబాద్,నవంబర్4 : ఉమ్మడి జిల్లాపరిధిలోని పాలేరు, సత్తుపల్లి, ఇల్లెందులో ఇటీవల జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు విజయవంతం కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నయా జోష్ నిండింది. సభలకు భారీగా ప్రజలు విచ్చేశారు. సీఎం కేసీఆర్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే ఉమ్మడి జిల్లాలో మూడు సభలు నిర్వహించడం విశేషం. నోటిఫికేషన్ తర్వాత సీఎం కేసీఆర్ ఆదివారం మరో రెండు సభలకు విచ్చేయనున్నారు. దీన్నిబట్టి కేసీఆర్ ఉమ్మడి ఖమ్మం జిల్లాపై ఎంత దృష్టి సారించారో అర్థం చేసుకోవచ్చు. సభల తర్వాత బీఆర్ఎస్ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను తీసుకెళ్తున్నారు. బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అక్టోబర్ 27న పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలం జీళ్లచెరువులో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగించిన తీరు ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని విమర్శించిన విధానంపై సభికుల నుంచి మంచి స్పందన వచ్చింది. 'తుమ్మలకు బీఆర్ఎస్ ద్రోహం చేసిందా..? బీఆర్ఎస్‌కు తుమ్మల ద్రోహం చేశారా?' అని సీఎం కేసీఆర్ ప్రశ్నించినప్పుడు ప్రజల నుంచి తుమ్మలకు వ్యతిరేకంగా నినాదాలు వినిపించాయి. అలాగే మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేరు ప్రస్తావించకుండానే కేసీఆర్ చురకలు అంటించారు. 'కొందరు బీఆర్ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటును తాకనివ్వం' అని అంటున్నారని, ప్రజల శక్తి ముందు వారంతా కొట్టుకుపోతారని ప్రకటించడంపై హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని కల్లూరు మండల కేంద్రంలో ఇటీవల జరిగిన ప్రజా ఆశీర్వాద సభ బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. సీఎం కేసీఆర్ పరోక్షంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యవహారశైలిని సభాముఖంగా ఎండగట్టారు. అసెంబ్లీ గేటు తాకనివ్వబోమని చేసిన పొంగులేటి వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. అలాగే ఇల్లెందు ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ 'ఉద్యమాల గడ్డ.. పోరాటాల పురిటిగడ్డ ఇల్లెందు' అని ప్రస్తావించినప్పుడు సభికులు కేరింతలు కొట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దళారుల రాజ్యమేనంటూ చేసిన ప్రసంగం ప్రజలను ఆకట్టుకుంది. ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో జరుగనున్న సీఎం కేసీఆర్ సభ మంత్రి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎంపీ నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మూడురోజులుగా ఖమ్మంలోనే మకాం వేసి మంత్రి పువ్వాడతో కలిసి సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసేందుకు ఇప్పటికే ఖమ్మం నగర పరిధిలోని అన్ని డివిజన్లతోపాటు రఘునాథపాలెం మండలంలోనూ బీఆర్ఎస్ శ్రేణులు జన సమీకరణ చేస్తున్నాయి. 2018 శాసనసభ ఎన్నికల ప్రచార సమయంలోనూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇదే కళాశాల మైదానంలో నిర్వహించిన సభకు విచ్చేశారు. పువ్వాడ అజయ్‌కుమార్‌ను గెలిపించాలని సభాముఖంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆ ఎన్నికల్లో పువ్వాడ అజయ్‌కుమార్ ఘన విజయం సాధించారు. ఎమ్మెల్యే అజయ్‌కుమార్ గెలిచిన తర్వాత సీఎం కేసీఆర్ మంత్రి పదవి కట్టబెట్టారు. కొత్తగూడెంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభలకు భారీగా జన సమీకరణ చేసేందుకు నాయకులు కృషి చేస్తున్నారు. ఖమ్మంలో సభ పూర్తి కాగానే సీఎం వెంటనే హెలికాప్టర్‌లో కొత్తగూడెం చేరుకుని ప్రసంగిస్తారు.

## లక్ష కోట్లు అప్పులు చేసిన నిర్మించిన కాళేశ్వరం

### అంధకారంలా మారింది : కిషన్‌రెడ్డి



జయశంకర్ భూపాలపల్లి, నవంబర్4 : లక్ష కోట్ల అప్పులు చేసి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ భవిష్యత్ అంధకారంగా మారిందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. శనివారం కుంగిన మేడిగడ్డ డ్యామ్‌ను బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, ఎంపీ లక్ష్మణ్ పరిశీలించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యత, నిర్మాణ లోపంతో మేడిగడ్డ బ్యారేజ్‌కు పగుళ్లు ఏర్పడి దెబ్బతిందని తెలిపారు. ఈ ఘటన తెలియడంతోనే కేంద్ర జలశక్తి నిపుణులకు లేఖ రాయడం జరిగిందని.. జాతీయ డ్యాం సేఫ్టీ అధికారులు వచ్చి చాలా తీవ్రమైన అంశాలు అందులో పొందుపరిచారని ఆయన చెప్పారు. అన్నారం బ్యారేజీ కింద పియర్స్ నుంచి వాటర్ నాణ్యత లోపం వల్లే వృధాగాపోతోందన్నారు. ప్రాజెక్టులో ఒక్క టీఎంసీ నీరు కూడా నిల్వలేదన్నారు. వేలకోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని అన్నారు. రాష్ట్ర ప్రజలు, ఇంజనీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని.. ప్రాజెక్టు నిర్మాణం శాస్త్రీయబద్ధంగా లేదన్నారు. సీఎం కేసీఆర్ ఇంజనీరుగా అవతారమెత్తి, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించడంతో ఈ దుస్థితి వచ్చిందని విమర్శించారు. తెలంగాణ ప్రజలకు ప్రాజెక్టు గుదిబండగా మారిందన్నారు. రైతులకు ఈ ప్రాజెక్టు వల్ల ఏ ఉపయోగం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి సీబీఐ దర్యాప్తుకు అంగీకరించాలన్నారు. లక్షల కోట్ల ప్రజాధనం గోదావరి పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారులు 20 అంశాలపైన డాటా అడిగితే రాష్ట్ర ప్రభుత్వం 11 అంశాలపైనే నివేదిక ఇచ్చిందని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

## పుప్పాల్‌గూడలో ఇద్దరు మృతి

నార్సింగి, నవంబర్4 : నగరంలోని పుప్పాల్‌గూడలో విషాదం నెలకొంది. ఓ నిర్మాణ సంస్థలో ఇద్దరు యువకులు మృతిచెందారు. రెడీమిక్స్ ప్లాంట్ మిక్సర్‌లో మృతదేహాలు నుజ్జు నుజ్జు అయ్యాయి. రెడీ మిక్స్ మిక్సర్ క్లీనింగ్ చేస్తుండగా ఆపరేటర్ ఒక్కసారిగా మిషన్ ఆన్ చేశాడు. దీంతో ప్రమాదవశాత్తు ఇద్దరు యువకులు రెడీ మిక్స్ మిక్సర్‌లోపడి మృతిచెందినట్లు సమాచారం. యువకులు మృతిచెందడంలో విషయం తెలుసుకున్న బంధువులు వారు పనిచేసే ప్రాంతానికి వచ్చి వాగ్వాదానికి దిగారు. అక్కడ ఉన్న ఫర్నీచర్ ధ్వంసం చేసి అద్దాలు పగలగొట్టారు. నార్సింగీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈఘటనకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## లిక్కర్ స్కామ్‌లో కవిత తప్పించుకోలేరు

- ఈ కేసులో ఎవ్వరినీ వదిలేది లేదు
- తెలంగాణలో నిరుద్యోగులను మోసం చేసిన కెసిఆర్
- కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్య



హైదరాబాద్,నవంబర్4 : ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తప్పు చేసిన వారెవరూ తప్పించుకోలేరని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. లిక్కర్ స్కామ్ ప్రతి ఒక్కరి నంబర్ వస్తుందని కవితను ఉద్దేశించి అన్నారు. లిక్కర్ కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎంగా ఉన్న మనీష్ సిసోడియానే విడిచిపెట్టలేదని గుర్తు చేశారు. కవితను ఎలా విడిచిపెడతామంటూ ఆయన ప్రశ్నించారు. కవిత పేరు ఢిల్లీ లిక్కర్ కేసులో ఉందన్నారు. హైదరాబాద్‌లో ఎన్నకిల ప్రచారం కోసం వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ మంచి చేస్తారని అనుకుంటే ఆయన కూడా నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. 10 ఏళ్ల తర్వాత ఇప్పుడు పార్టీ పేరు మార్చి దేశ రాజకీయాల్లో చక్రం తిప్పాలని కేసీఆర్ భావిస్తున్నారన్నారు. జాతీయ రాజకీయాలు కేసీఆర్ చేద్దామనుకుంటే.. లిక్కర్ కేసులో కవిత జాతీయ స్థాయి వార్తల్లో నిలిచారంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఎంత తిన్నా సరిపోలేదని బిడ్డను ఢిల్లీకి పంపాడు కేసీఆర్ అంటూ కేంద్రమంత్రి వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ మొదట బయట పడినప్పుడు అనురాగ్ ఠాకూరే.. ఎక్కువగా మీడియా ముందుకు వచ్చి మాట్లాడేవారు. దర్యాప్తు సంస్థల కన్నా ముందుగా అనురాగ్ ఠాకూరే ఎవరు ఎప్పుడు అరెస్టవుతారు... ఎవరు ఎలా అవినీతికి పాల్పడ్డారో చెబుతూ ఉండేవారు. దర్యాప్తు చేస్తున్న సీబీఐ, ఈడీ నా లేకపోతే బీజేపీనా అనే విమర్శలు వచ్చిన తర్వాత వెనక్కి తగ్గారు. సౌత్ లాబీ నుంచి కవిత కీలక పాత్ర పోషించారని దర్యాప్తు సంస్థలు తేల్చాయి. చార్జిషీట్లు దాఖలు చేశాయి. మిగతా నిందితులు అందర్నీ అరెస్టు చేశారు. వారిలో దాదాపు అందరూ అప్రూవర్లుగా మారారు. ఒక్క కవిత మాత్రమే నిందితురాలిగా ఉన్నారు. ఆమె తనపై విచారణ జరగకుండా.. ఈడీ విచారణకు పిలవకుండా.. సుప్రీంకోర్టుకు వెళ్లి రెండు నెలల పాటు రిలీఫ్ తెచ్చుకున్నారు. దీంతో ప్రస్తుతం ఈ కేసు విచారణ ఆగింది. నవంబర్ నెలలోనే కవిత పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది.ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరవింద్ కేజ్రీవాల్ పేరు కూడా తెరపైకి వచ్చింది. ఆయనకు ఇటీవల ఈడీ సమన్లు జారీ చేసింది. కానీ కేజ్రీవాల్ విచారణకుహాజరు కాలేదు. హాజరు అయితే అరెస్టు చేస్తారన్న ఉద్దేశంతో ఆయన హాజరు కాలేదని చెబుతున్నారు. మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారానికి వెళ్తున్నానని.. అది తప్పుడు కేసు అని ఈడీకి లేఖ రాసి వెళ్లిపోయారు. ఇప్పుడు ఈడీ ఈ కేసులో ఏం చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో అనురాగ్ ఠాకూర్.. కవితనూ వదిలేది లేదని హెచ్చరికలు జారీ చేయడం రాజకీయవర్గాల్లో కొత్త చర్చకు కారణం అవుతోంది.

## తుమ్మలను నన్ను ఓడించటానికి డబ్బులు సంచులు పంపారు : పొంగులేటి



ఖమ్మం,నవంబర్4 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావును, నన్ను ఓడించడానికి సీఎం కేసీఆర్ డబ్బు కట్టలు పంపారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం నేలకొండపల్లిలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. పొంగులేటి మీడియాతో మాట్లా డుతూ..."ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం, పాలేరుకు ఎంత డబ్బయిన పంపి మమ్మల్ని ఓడించాలని చూస్తున్నాడు. డబ్బొక్కటే ఈ ఎన్నికల్లో రాజకీయం చేయదు. బీఆర్ఎస్ నేతల అహంకారనికి, అధికార మదానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పులిస్టాఫ్ పెట్టే టైమ్ వచ్చింది. గతంలో మనం గెలిపించిన ఎమ్మెల్యేనే అని మెతక వైఖరి అవలంభిస్తే మిమ్మల్ని అవతలి వారి గానే చూస్తారు. కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పని చేయండి మీకు అండగా మేముంటం. ముప్పై రోజుల పాటు కష్టపడండి. ఆ తర్వా త మీ కష్టాలు తీర్చే బాధ్యత మేము తీసుకు ంటాం" అనిపొంగులేటిశ్రీనివాసరెడ్డి తెలిపారు.

## కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో 80 వేల కోట్ల ప్రజాధనం వృథా

### కెసిఆర్ ప్రాజెక్టుల్లో క్వాలిలేదని కేంద్రం నివేదిక

### మీడియాతో ఎంపి అర్వింద్



జగిత్యాల,నవంబర్4 : కాళేశ్వరం ప్రాజెక్ట్ తో 80 వేల కోట్ల ప్రజాధనం వృథా అయిందని నిజామాబాద్ ఎంపీ, కోరుట్ల అభ్యర్థి ధర్మపురి అరవింద్ అన్నారు. బూడిదలో పోసిన పన్నీరులా ఈ ప్రాజెక్ట్ వ్యయం ఉందన్నారు. శనివారం నాడు కోరుట్ల పట్టణంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అరవింద్ మీడియాతో మాట్లాడుతూ..' మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల డ్యామ్‌లలో క్వాలిటి లేదు. వీటిపై కేంద్ర బృందం నివేదిక ఇచ్చింది. రైతులంతా బీజేపీ పార్టీకి అండగా ఉండాలి. భగీరథ నీళ్లు ఎరుపు రంగులో వస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి నర్సింగరావు నన్ను కలిసిండు. సీఎం కేసీఆర్ ఆశీస్సులు నర్సింగరావుకు ఉన్నాయి. కోరుట్లలో కేసీఆర్ అభ్యర్థి నర్సింగరావే..కేసీఆర్ గోర్లు, రేవంత్‌రెడ్డి బర్లు మింగేటోళ్లు వాళ్లతో ఈ ఎన్నికల్లో జాగ్రత్తగా ఉండాలని అరవింద్ పేర్కొన్నారు. నిజామాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌లో 7 స్థానాలు కైవసం చేసుకుంటామన్నారు. కాంగ్రెస్ హేమా హేమీలకు ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోయిన కవితకు మా గురించి మాట్లాడే అర్హత లేదు. కవిత ఈ ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేసినా ఓటమి తప్పదు. బీఆర్ఎస్ పార్టీ ఓటమికి కేటీఆర్ కవితలే కారణం అవుతారు. డిసెంబర్ 3వ తేదీ తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు సగం మంది ఆ పార్టీలో ఉండరు. కవితపై ఈడీ విచారణ కొనసాగుతోంది. ఆధారాలు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ పార్టీ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కాపాడు తోంది. కోరుట్లలో పద్మశాలి బంధుకు నా సంపూర్ణ మద్దతు ఉంటుంది. కోరుట్లలో 20 శాతం పైగా ఓట్ల మెజార్టీతో నేను గెలుస్తాను. కవిత నన్ను ఓడించడం కాదు.. వాళ్ల కార్యకర్తలే ఆమెను గత ఎన్నికల్లో ఓడించారు. తెలంగాణలో బీజేపీ పార్టీకి స్పష్టమైన మెజార్టీ వస్తుంది. ఉత్తర తెలంగాణలో స్వీప్ చేస్తాం. వ్యవసాయ సంస్కరణలు బీజేపీతోనే సాధ్యం అని ఎంపీ అరవింద్ తెలిపారు.

## మరో ఐదేళ్లు రేషన్ ఉచితమే

(మొదటిపేజీ తరువాయి)

ఉండే కమిటీనే.. తప్పు జరిగింది అని చెప్పిందన్నారు. అవినీతి ని వదలను అని చెప్పే మోడీ ఎందుకు మౌనంగా ఉన్నాడు? అని ప్రశ్నించారు. నివేదిక మీద చర్యలు తీసుకో అంటే.. రాష్ట్రంలో అధికారం లోకి వస్తే చర్యలు తీసుకుంటా అని చెప్పడం ఏంటి? అని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి రాదు.. విచారణ జరపం అని చెప్పదలుచుకున్నదా బీజేపీ అని ప్రశ్నించారు. ప్రాజెక్టు రీ డిజైన్ పేరుతో కేసీఆర్ దోపిడీకి తెర లేపారన్నారు. మెడిగడ్డ ప్లానింగ్ వేరు.. డిజైన్ అనుకున్నది ఒకటి చేసింది ఒకటి అని మండిపడ్డారు. నేనే ఆలోచన చేసి.. మెదడు, రక్తం ధారపోసి కట్టిన అన్నారు కేసీఆర్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ కుంగి పోగానే.. సాంకేతిక నిపుణుల మీద తోసి పనిలో పడ్డారని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంచనాలు 38, 500 కోట్లను లక్ష 51 వేళా కోట్లకు పెంచిందన్నారు.

## ప్రభుత్వం మెడలు వంచి మధిరను అభివృద్ధి చేశాను

(మొదటిపేజీ తరువాయి)

మహిళలకు 500 రూపాయలకే సిలిండర్, ప్రతినెల మహిళలకు 2,500 వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం ఇవన్నీ కలిపి నెలకు 5000 రూపాయల వరకు లబ్ధి చేకూర్చే విధంగా కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ ప్రకటించిందని గుర్తుచేశారు. పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు ఇండ్ల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇస్తామన్నారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి 12,000 ఆర్థిక సాయం చేస్తామన్నారు. చదువుకునే యువతకు ఐదు లక్షల క్రెడిట్ కార్డు ఇస్తామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి ఆరోగ్యశ్రీని 10 లక్షల రూపాయలకు పెంచుతామన్నారు. ప్రతి ఇంటికి 200 యూనిట్స్ వరకు ఉచితంగా కరెంటు అందిస్తామన్నారు.

## కాంటినెంటల్ హాస్పిటల్స్ ఖాతాలో మరో అవార్డు

### బెస్ట్ పేషెంట్ సెంట్రిక్ రీజనల్ హాస్పిటల్ గా ఎంపిక



హైదరాబాద్,నవంబర్4 : డాక్టర్ గురు ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యుత్తమమైన వైద్య సేవలు అందిస్తున్న కాంటినెంటల్ హాస్పిటల్స్ ప్రయాణంలో ఇప్పుడు మరో అవార్డు చేరింది. ముంబయిలో జరిగిన ఐ డబ్ల్యూ హెచ్ పేషెంట్ ఫస్ట్ సమ్మిట్ అవార్డ్స్ లో భాగంగా.. 2023 సంవత్సరానికిగాను, బెస్ట్ పేషెంట్ సెంట్రిక్ రీజనల్ హాస్పిటల్ గా, కాంటినెంటల్ హాస్పిటల్స్ ఎంపికైంది. ప్రపంచస్థాయి ప్రమాణాలతో, అత్యాధునిక టెక్నాలజీతో నాణ్యమైన వైద్యసేవలు అందిస్తోన్న మాకు ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ఎల్లప్పుడు పేషెంట్ సెంట్రిక్ గా వర్క్ చేసే మాకు ఈ అవార్డు మరింత ప్రోత్సాహాన్నిచ్చి మమ్ముల్ని ముందుకు తీసుకు వెళ్తుందనడంలో ఎలాంటి సందేహంలేదు. మా కాంటినెంటల్ హాస్పిటల్స్ లో సెక్యూరిటీ దగ్గరినుంచి పై స్థాయి వరకు అందరికీ సమానస్థాయి గౌరవం ఉంటుంది. ఇదే మా విజయాలకు దోహదపడుతుంది. వాల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నిబంధనలకు అనుగుణంగా ఉంటూ.. అలాగే నియమాలను పాటిస్తూ.. భారతదేశపు ఫస్ట్ లెవల్ 3 గోల్డ్ స్టాండర్ట్ పొందిన మొదటి హాస్పిటల్ మా కాంటినెంటల్ హాస్పిటల్స్ అయినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాము. అలాగే 50కి పైగా ప్రత్యేకతలు మరియు 100 మందికి పైగా కన్సల్టెంట్స్ తో అన్ని వయసుల వారికి, ఆరోగ్య సేవలు అందిస్తూ ఆదర్శప్రాయంగా నిలిచింది కాంటినెంటల్ హాస్పిటల్స్. శ్రేష్ఠత, నాణ్యతకుగాను మా ఆసుపత్రి నిబద్ధతకు అనేక అవార్డులు, అక్రిడిటేషన్‌లు మరియు ప్రశంసలు వచ్చాయి. కాంటినెంటల్ హాస్పిటల్స్ ప్రపంచంలోని కొన్ని ప్రముఖ అక్రిడిటేషన్ ప్రమాణాల ద్వారా గుర్తింపు పొందింది.

## మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలి

### అంబర్ పేట ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్



హైదరాబాద్,నవంబర్4 : గోల్నాక డివిజన్‌లో ఎమ్మెల్యే కాలేరు ఎన్నికల ప్రచార పాదయాత్ర లో జనం భారీగా పాల్గొన్నారు. అంబర్ పేట ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ ఎన్నికల ప్రచారంలో జోరు పెంచారు. గోల్నాక డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించారు. బస్తీ ప్రజలు ఆయనకు ఘన స్వాగతం తెలుపుతూ హుషారుగా పాల్గొని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో సంక్షేమం మరియు జరిగిన అభివృద్ధి చాలా బావుందని సంతృప్తి వ్యక్తం చేశారు. రేపు జరగబోయే ఎన్నికల్లో అందరం కలిసి సీఎంగా కేసీఆర్ ని మూడవసారి నిలబెట్టాలని, బీఆర్ఎస్ పార్టీ నే గెలిపించాలని కాలేరు వెంకటేష్ కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మేనిఫెస్టోలో మహిళలకు పెద్ద పీట వేశారు.. అదే అంశాన్ని ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తూ మహిళలకు వివరించడం జరిగింది. ఈ ప్రచారంలో మహిళల నుంచి అనూహ్యమైన స్పందన వస్తుందన్నారు. మన కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలే ఇప్పుడు మనకు అందుతున్నాయని తెలిపారు. మీరు మళ్లీ అంబర్పేట్ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాలేరు వెంకటేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఎస్పీ అభ్యర్థుల మూడవ జాబితా విడుదల

### మహేశ్వరం నుండి కొత్త మనోహర్ రెడ్డికి అవకాశం




హైదరాబాద్,నవంబర్4 : మరో 25 మందితో బీఎస్పీ అభ్యర్థుల మూడవ జాబితా విడుదల చేసింది. బీఎస్పీ అధి నేత్రి కుమారి మాయావతి అనుమతితో బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్య క్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ 2023 అసెంబ్లీ ఎన్నికలకు సంబం ధించి అభ్యర్థుల మూడవ జాబితా ప్రకటించారు. మూడవ విడత జాబితాలో మహేశ్వరం-కొత్త మనోహర్ రెడ్డి, చెన్నూ ర్ (ఎస్సీ)- డా. దాసారపు శ్రీనివాస్, అదిలాబాద్-ఉయక ఇందిర, ఆర్మూర్-గండికోట రాజన్న, నిజామాబాద్ (రూరల్)- మటమాల శేఖర్, బాల్కొండ-పల్లికొండ నర్సయ్య, కరీం నగర్-నల్లాల శ్రీనివాస్, హుస్నాబాద్-పెద్దోళ్ల శ్రీనివాస్ యాదవ్, నర్సాపూర్-కుతాడి నర్సిం హులు, సంగారెడ్డి-పల్పనూరి శేఖర, మేడ్చల్-మల్లేపోగు విజయరాజు, కుత్బుల్లాపూర్-మహ్మద్ లమ్రా అహ్మద్, నగర్-గువ్వ సాయి రామ కృష్ణ ముదిరాజ్, రాజేంద్రనగర్-రాచమల్లు జయసి ంహ (రివైజ్డ్), అంబర్ పేట్-ప్రో. అన్వర్ ఖాన్ (రివైజ్డ్), కార్వాన్-ఆలేపు అంజయ్య, గోషా మహల్-మహ్మద్ కైరుద్దీన్ అహ్మద్, నారాయణ్ పేట్-బొడిగెల శ్రీనివాస్, జడ్చర్ల-శివ వుల్కుం దఖర్, అలంపూర్ (ఎస్సీ)-మాకుల చెన్న కేశవరావు, పరకాల-అముధాలపల్లి నరేష్ గౌడ్, భూపాలపల్లి-గజ్జి జితేందర్ యాదవ్, ఖమ్మం-అయితగాని శ్రీనివాస్ గౌడ్, సత్తుపల్లి (ఎస్సీ)- సీలం వెంకటేశ్వర రావు, నారాయణ్ ఖేడ్-మహ్మద్ అలాఉద్దీన్ పటేల్ లకు చోటు దక్కింది.

## గొర్లను మింగేటోడు కేసీఆర్..

### బర్లను మింగేటోడు రేవంత్ రెడ్డి

### ఎంపీ అరవింద్ తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్,నవంబర్4 : గొర్లను మింగేటోడు కేసీఆర్ అయితే, బర్లను మింగేటోడు రేవంత్ రెడ్డి అంటూ విమర్శలు గుప్పించారు ఎంపీ అరవింద్. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ నేనే కట్టిన అనే చంద్రబాబు ఇక్కడ అభ్యర్థులను ఎందుకు పెట్టడం లేదన్నారు ఎంపీ అరవింద్. అభ్యర్థులను పెట్టకుండా కాంగ్రెస్ పార్టీకి చంద్రబాబు సపోర్ట్ చేస్తున్నాడని విమర్శించారు. అవినీతి కేసీఆర్ ను మించిన రేవంత్ రెడ్డి పూర్తిగా చంద్రబాబు కంట్రోల్ ఉంటాడని, చక్కెర ఫ్యాక్టరీలను నాశనం చేసింది చంద్రబాబు అని ఆయన మండిపడ్డారు. మేము ముస్లింలను కూడా ఓట్లు వేయాలని కోరుతున్నామని, రానున్న కాలంలో ముస్లిం బస్తీలకు కూడా రోడ్ షో లు వస్తాయన్నారు ఎంపీ అరవింద్. కార్పొరేటర్, కౌన్సిలర్ లను కొని రాజకీయాలు చేయడం లేదు ప్రజలను నమ్మి రాజకీయాలు చేస్తామని ఆయన వ్యాఖ్యానించారు. డిసెంబర్ 4వ తేదీన 20 మంది కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యే లుగా పోటీ చేసే వాళ్ళు బీఆర్ఎస్ లో చేరతారని చెప్పారు. అందుకే రైతుల ఓట్లు వృధా కాకుండా బీజేపీని గెలిపించాలని కోరారు.దేశంలో చెరకు ఫ్యాక్టరీలు ఏ రకంగా నడపాలో కేంద్ర ప్రభుత్వానికి ఒక పాలసీ ఉందని ఎంపీ అరవింద్ వ్యాఖ్యానాఇంచారు. బీజేపీ ప్రభుత్వం ప్రణాళిక బద్ధ పాలసీలతో మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి నడిపిస్తుందన్నారు. మూతపడ్డ చాలా ఫ్యాక్టరీలను రాష్ట్రాలలో తెరిపించామన్నారు. పసుపు బోర్డు కాస్త ఆలస్యమైన ఇచ్చిన మాట ప్రకారం నేరవేర్చమని చెప్పారు. బీడీ కార్మికుల సమస్యలు బాగా ఉన్నాయని అధికారంలోకి వచ్చాక వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

## మరో ఐదేళ్లు రేషన్ ఉచితమే

(మొదటిపేజీ తరువాయి)



"కాంగ్రెస్ ఆత్మగౌరవం - ఆత్మవిశ్వాసం గల పేదలను ద్వేషిస్తుంది. పేదలు ఎల్లప్పుడూ తన ముందు నిలబడి వేడుకోవాలని కోరుకుంటుంది. కాబట్టి అది పేదలను, పేదల్లానే ఉంచాలని కోరుకుంటుంది. కాబట్టి, ఇక్కడ అధికారంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం చేసే ప్రతి పనిని ఆపడానికి తన శక్తిని ఉపయోగిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది.. గత ఐదేళ్లుగా కాంగ్రెస్ చేస్తున్న అన్యాయం.. అవినీతిని మీరు సహించారు. నన్ను నమ్మండి, కేవలం 30 రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఆ తర్వాత మీరు ఈ సమస్య నుంచి విముక్తి పొందుతారు" అంటూ ప్రధానమంత్రి మోదీ హామీనిచ్చారు. అంతేకాకుండా, ప్రధానమంత్రి మొత్తం సమాజాన్ని కాంగ్రెస్ దుర్వినియోగం చేస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. తాను దుర్వినియోగాలకు భయపడనని.. అందరి అభ్యున్నతే లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ ను ఓడించి బీజేపీని గెలిపించాలని ప్రధాని మోదీ కోరారు. కాగా.. ప్రధాని మోదీ ప్రకటనలు రాజకీయ వేడిపుట్టించాయి. ఎన్నికలకు ముందు ఇప్పటికే భారతీయ జనతా పార్టీ మేనిఫెస్టోను విడుదల చేసింది. ఇదిలాఉంటే.. ఛత్తీస్‌గఢ్‌లో అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతల్లో జరగనున్నాయి. తొలి విడతలో 20 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 7న, రెండో విడతలో మిగతా 70 స్థానాలకు నవంబర్ 17న పోలింగ్ జరగనుంది. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ నెలకొంది.

# రెండో రోజు పలువురు అభ్యర్థుల నామినేషన్

### పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు

### పాతబస్తీలో జోరుగా ఎన్నికల ప్రచారం




హైదరాబాద్,నవంబర్4 : తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర వ్యాప్తంగా నామినేషన్ల సందడి కనిపిస్తోంది. రెండో రోజు కూడా రాష్ట్రవ్యాప్తంగా పలువురు అభ్యర్థులు రిటర్నింగ్ అధికారులకు తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ప్రధాన పార్టీల్లో టికెట్ ఖరారైన అభ్యర్థులతో పాటు ఆశావహులు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేస్తున్నారు. తొలిరోజు 94 నామినేషన్లు నమోదు కాగా.. ఇవాళ కూడా పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో స్పీకరం పోచారం శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్ వేశారు. 1994 నుంచి వస్తున్న ఆనవాయితీ ప్రకారం తన పాత అంబాసిడర్ కారులో వెళ్లి.. బాన్సువాడ ఎమ్మార్వో ఆఫీసులో నామినేషన్ వేశారు. నామినేషన్‌కి బయలుదేరే ముందు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. 1994 నుంచి ఇప్పటి వరకూ 8 సార్లు పోటీ చేసి 7 సార్లు గెలిచిన పోచారం.. ఈ సారి కూడా గెలుపు తనదే అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్‌కి చాలా స్థానాల్లో పోటీనే లేదని సర్వేలు చెబుతున్నాయి.. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమని పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.ఖమ్మం జిల్లా పాలేరులో కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నామినేషన్ వేశారు. పొంగులేటి తరపున ఆయన సోదరుడు సోదరుడు ప్రసాద్ రెడ్డి.. నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. మంథని కాంగ్రెస్ అభ్యర్థిగా దుద్దిళ్ల శ్రీధర్ బాబు నామినేషన్ దాఖలు చేశారు. మంథని మండలం కన్నాల గ్రామంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు పట్టణంలోని మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నామినేషన్ వేశారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు.వికారాబాద్ జిల్లా తాండూరులో కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. తాండూరు ఆర్డీవో కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ సమర్పించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏ.చంద్రశేఖర్ రావు.. నామినేషన్ దాఖలు చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థిగా అడ్లూరి లక్ష్మణ్ నామినేషన్ వేశారు. గోషామహల్ బీజేపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే రాజాసింగ్ నామినేషన్ దాఖలు చేశారు. భారీ ర్యాలీతో వెళ్లి నామినేషన్ వేశారాయన. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ హాజరయ్యారు. తెలంగాణలో ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ పార్టీలు ప్రచారంలో జోరు పెంచాయి. ఇప్పటికే ఆయా పార్టీల అగ్రనేతలు వరుస సభలు, సమావేశాలతో దూకుడు పెంచారు. కుటుంబ సభ్యులు కూడా ప్రచారంలో మేము సైతం అంటున్నారు. ఎంఐఎం నేతలు ప్రచారంలో ఎప్పుడూ ముందుంటారనే చెప్పాలి. ఎన్నికలు ఉన్నా లేకపోయినా నిత్యం జనాల్లోనే ఉంటారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల కష్టాలు తెలుసుకుంటారు. చిన్న చిన్న శుభకార్యాలకు కూడా వెళ్లి ఇంట్లోని కుటుంబ సభ్యుల్లా కలిసిపోతుంటారు. ఇక ఆ పార్టీ అగ్రనేతలు వస్తున్నారంటే కార్యకర్తల్లో జోష్ మామూలుగా ఉండదు. ఇక తెలంగాణ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ 9 స్థానాల్లో పోటీ చేస్తున్నట్టు ప్రకటించింది. దాదాపు అభ్యర్థులను కూడా ఖరారు చేసింది. అయితే రెండు స్థానాల్లో సిట్టింగ్‌లను పక్కనపెట్టి కొత్త వారికి అవకాశం కల్పించింది. అంతే కాకుండా నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ అభ్యర్థిని యాకుత్‌పురాకు మార్చారు. ఆ స్థానంలో కొత్త అభ్యర్థికి అవకాశం ఇచ్చారు. అలాగే బహదూర్‌పురా, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో ఎంఐఎం అభ్యర్థులపై సందిగ్ధత నెలకొంది. ఇంత వరకు ఆ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించలేదు. దీంతో అభ్యర్థి ఎవరా అన్న దానిపై స్థానికులతో పాటు ఎంఐఎం వర్గాల్లోనూ ఉత్కంఠ నెలకొంది. ఎవరిని మారుస్తారు, లేక పాత అభ్యర్థులనే బరిలోకి దించుతారా అన్న సంధ్దిగత నెలకొంది. మిగతా స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన చోట ఎంఐఎం అగ్రనేతలు ప్రచారం కొనసాగిస్తున్నారు. రాత్రి సమయాల్లో మీటింగ్‌లతో దూసుకుపోతున్నారు. అయితే కేవలం అగ్రనేతలే కాకుండా ఇప్పుడు వారి కుమారులు సైతం రంగంలోకి దిగారు. దీంతో కార్యకర్తల్లో మరింత జోష్ పెరిగింది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కుమారుడు సుల్తాన్ సలావుద్దీన్‌తో పాటు అక్బరుద్దీన్ ఒవైసీ కుమారుడు నూరుద్దీన్ ఒవైసీ తండ్రులతో పాటు ప్రచారంలో పాల్గొన్నారు. పాదయాత్రలు చేస్తూ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారారు. జనాలు సైతం పెద్ద నేతలను పట్టించుకోకుండా వారి కుమారులను కలిసేందుకే మొగ్గు చూపుతున్నారు. వారితో కరచాలనం చేసి సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఇది వరకు ఎప్పుడూ ప్రచారంలో కనిపించని అసద్, అక్బరుద్దీన్ కుమారులు ఒక్కసారిగా జనాల్లోకి వచ్చేసరికి ఆ పార్టీ కార్యకర్తలు కూడా ఉత్సాహంగా వారి వెంట అడుగులు వేస్తున్నారు.

## బిసి ముఖ్యమంత్రి ప్రకటనతో బెంబేలు

### బిసిల ఆత్మగౌరవ సభకు హాజరవుతున్న మోడీ

### 7న హైదరాబాద్‌కు రానున్న ప్రధాని మోడీ

### మీడియా సమావేశంలో ఎంపి లక్ష్మణ్ వెల్లడి



హైదరాబాద్,నవంబర్4 : ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో బీజేపీ పార్టీ బీసీల ఆత్మగౌరవ సభ నిర్వహించనుంది. ఈ సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీని ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈమేరకు బీజేపీ అధిష్ఠానం అన్నీ ఏర్పాట్లు చేస్తోంది. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఈ మేరకు మీడియాకు వివరాలు తెలిపారు. యావత్ సమాజం సభకు హాజరుకావాలని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. బీజేపీ ప్రకటనతో బీసీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీసీలు రెడీగా ఉన్నారు. పార్టీలకు అతీతంగా బీసీలు బీజేపీ పార్టీకి మద్దతు పలుకుతున్నారు. బీసీల చిరకాల వాంఛ ముఖ్యమంత్రి పదవి. బీసీ ముఖ్యమంత్రి ప్రకటనను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అవహేళన చేస్తున్నాయి. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, మంత్రి కేటీఆర్‌లు బీసీ సీఎం ప్రకటన పై వ్యగ్యంగా మాట్లాడారు. రాహుల్ గాంధీ, కేసీఆర్, కేటీఆర్ల మెడలు వంచాలని బీసీ సమాజాన్ని కోరుతున్నాను. బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించే దమ్ము బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఉందా అని లక్ష్మణ్ సవాల్ విసిరారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎంను చేస్తామని కేంద్రం హోం మంత్రి అమిత్ షా ప్రకటించారని, ఆ నిర్ణయాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ జీర్ణించుకోలేక పోతున్నాయని లక్ష్మణ్ అన్నారు.తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనలో బీసీలను అన్ని విధాలుగా అణచివేశారని, వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని ఆరోపించారు. 'బీసీ వ్యక్తి సీఎం అయ్యేది లేదు. బీజేపీ అధికారంలోకి వచ్చేది లేదు' అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అవహేళన చేశారని గుర్తు చేశారు. బీసీల అభ్యున్నతి కోసం ఒక్క కమిషన్ కూడా వేయని కాంగ్రెస్ ఇప్పుడు వారి పట్ల మొసలి కన్నీరు కారుస్తోందని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తిని సీఎంగా చేస్తామని, బీఆర్ఎస్ కానీ, కాంగ్రెస్ కానీ చెప్పగలవా.? అంటూ నిలదీశారు. బీసీల అభ్యున్నతి కోసం ఆలోచించే ఏకైక పార్టీ బీజేపీ అని లక్ష్మణ్ స్పష్టం చేశారు. బీసీల సాధికారత కోసం కట్టుబడి ఉన్నామని, బీజేపీ ప్రకటించిన 88 మంది అభ్యర్థుల్లో 31 మంది బీసీలకు టికెట్లు కేటాయించామని చెప్పారు. అధికారంలోకి రాగానే బీసీ సబ్ ఎ÷-లాన్ తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 7న బీసీ ఆత్మ గౌరవ సభ, 11న ఎస్సీ వర్గీకరణపై సభ ఉంటుందని వివరించారు. ప్రధాని మోదీ ఈ సభలకు హాజరవుతారని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటన ఖరారైంది. ఆయన నవంబర్ 7న రాష్ట్రానికి రానున్నారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభలో పాల్గొననున్నారు. ఆ రోజు సాయంత్రం ఢిల్లీ నుంచి నేరుగా ప్రత్యేక విమానంలో సాయంత్రం 5:05 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఎల్బీ స్టేడియానికి వచ్చి, 5:30 నుంచి 6:10 వరకూ సభలో ప్రసంగిస్తారు. అనంతరం సభ ముగించుకుని 06:35కు తిరిగి ఢిల్లీ పయనమవుతారు. ఈ క్రమంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు, ఈ సభను బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకోగా, దాదాపు లక్ష మందితో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. బీజేపీ ప్రతినిధుల బృందం సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది.

## కామారెడ్డిలో కెసిఆర్‌తో రేవంత్ ఢీ

### రేవంత్ పోటీకి కాంగ్రెస్ అధిష్టానం ఓకే

### 6న కొడంగల్,8న కామారెడ్డిల్లో నామినేషన్

### నిజామాబాద్ అర్బన్‌కు షబ్బీర్ అలీ




హైదరాబాద్,నవంబర్4 : కామారెడ్డిలో సిఎం కెసిఆర్‌పై పిసిసి చీఫ్ రేవంత్ పోటీ ఖాయమయ్యింది. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానం కూడా ఆమోదించినట్లు సమాచారం. దీంతో ఆయన అక్కడ బరిలోకి దిగేందుకురంగంసిద్దంచేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీ చేయనున్నారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని రేవంత్‌కి ఏఐసీసీ ఆదేశించింది. ఈ నెల 8వ తేదీన కామారెడ్డిలో రేవంత్ నామినేషన్ వేయనున్నారు. ఈ నెల 6వ తేదీన కొడంగల్‌లో రేవంత్ నామినేషన్ వేయనున్నారు. రేవంత్ కామారెడ్డి నుంచి బరిలోకి దిగుతుండడంతో షబ్బీర్ అలీ నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేయనున్నారు. షబ్బీర్ అలీ నామినేషన్‌కి రేవంత్‌రెడ్డి వెళ్లనున్నారు. కామారెడ్డి నుంచి ఇంత కాలం షబ్బీర్ ప్రాతినిధ్యం వహించారు. ఇప్పుడు కెసిఆర్ రావడంతో మార్పులు జరిగాయి. దీంతో ఉమ్మడి నిజామాద్ ఎన్నికల రణక్షేత్రంగా మారనుంది. ఇదిలావుంటే ఫాల్స్ ప్రచారం చేయడంలో మంత్రి కేటీఆర్ నెంబర్ వన్ అని పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్ ఎద్దేవ చేశారు. శనివారం నాడు గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడు తూ.. 'డీకే శివకుమార్ ఓ కంపెనీకి లేఖ రాశారని కేటీఆర్ తప్పుడు మాటలు చెప్తున్నాడు. కాళేశ్వరం ఇష్యుని డైవర్ట్ చేయడం కోసం కేటీఆర్ ప్రయత్నం చేస్తున్నాడు. కాంగ్రెస్ పార్టీ మీద బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. మా వార్ రూమ్ నుంచి డీకేతో మాట్లాడాము. డీకే లెటర్ హెడ్ ని ట్యాంపర్ చేశారని పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదయింది. కేటీఆర్ గ్రామస్థాయి, బూతుస్థాయి నాయకుడి లాగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని ఎలా బ్లేమ్ చేయాలనేదే కేటీఆర్ పనిగా పెట్టుకున్నారు. ఫేక్ న్యూస్, మార్ఫింగ్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మేము ఓయూలో బస్సు పెట్టి కర్ణాటక రాష్ట్రానికి రావాలని సవాల్ విసిరినా కేటీఆర్,బీఆర్ఎస్‌నేతలు స్పందించలేదని చామల కిరణ దెప్పిపొడిశారు.

## ఈ ప్రభుత్వాన్ని కొల్లగొట్టే టైం ఆసన్నమైంది

### కేసీఆర్ కుటుంబానికి ఏటిఎంలా కాళేశ్వరం ప్రాజెక్ట్

### మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి



హైదరాబాద్,నవంబర్4 : చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలను నన్ను కేసీఆర్ తన అవసరానికి వాడుకొని వదిలి పెట్టాడని ఆరోపించారు మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి. ఇవాళ ఆయన మంచిర్యాల జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్, కేసీఆర్ కుటుంబానికి ఒక ఏటిఎం మిషన్ లాగా ఉన్నదని, ఆ ప్రాజెక్టుకు పెట్టిన డబ్బులతో రాష్ట్రానికి ఖర్చు పెడితే ఎంతోమంది పేదలకు ఇండ్లు వచ్చేవన్నారు. ఈ ప్రభుత్వాన్ని కొల్లగొట్టే టైం ఆసన్నమైందని, తాను ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిస్తే అమాయకులైన ప్రజల మీద టిఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ లాగా తప్పుడు కేసులు ఉండవన్నారు వివేక్ వెంకటస్వామి. ఇక్కడ బాల్క సుమన్ చెన్నూరు నియోజకవర్గంలో ఇసుక మాఫియాకు కాంట్రాక్టింగ్ లకు పెట్టింది పేరుగా ఒక నియంతల వ్యవహరిస్తున్నాడని ఆయన ఆరోపించారు. ఇక నుంచి ఆయన ఆటలు సాగవు. ప్రజలు కోరుకున్నారనే అసెంబ్లీ బరిలో ఉంటున్న. కేసీఆర్ ఓదేలును, నన్ను రోడ్డు మీద పడేసిండు. ఇప్పుడు కేసీఆర్ ను ఇద్దరం కలిసి రోడ్డున పడేస్తం. గతంలో చివరి క్షణంలో టికెట్ ఇస్తా అని మోసం చేసిండు. కుటుంబ పాలనలో నాయకుల గొంతు కోయడం కొత్తదేమి కాదు. ప్రాణహిత ప్రాజెక్టు గ్రావిటీ ప్రాజెక్టు అది మా తండ్రి హాయాంలో తెచ్చారు. ఇప్పుడు కమీషన్ ల కోసమే కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టారు. సెంట్రల్ గవర్నమెంట్ కూడా కాళేశ్వరం డబ్బుల కోసమే కట్టారని నివేదిక ఇచ్చింది. ముఖ్యమంత్రి పూర్తిగా అవినీతిలో కురుకుపోయిండు. ముఖ్యమంత్రిని ఓడగొట్టేందుకు ఇదే కరెక్ట్ సమయం. కేసీఆర్ ఓటుకు డబ్బులిస్తే తీసుకోవాలి. అవి జనాల పైసలు. పోలీసులు ఒత్తిళ్లు తెచ్చిన, కేసులు పెట్టిన బయపడొద్దు. చేతి గుర్తుకు ఓటేసి గెలిపించండి' వివేక్ కోరారు.

## దేశంలోనే మోడల్ తెలంగాణగా రాష్ట్రం పరుగులు

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియానే ప్రకటించిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ నమూనా అంటే సమగ్ర, సమీకృత, సమ్మిళిత, సమతుల్య మోడల్. పదాలు బాగున్నాయిని వాడటం లేదు. తెలంగాణలో జరుగుతున్న సమతుల్య మోడల్ ఎక్కడా లేదు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు ఒక ఇమేజ్ ఉండేది. ప్రో బిజినెస్, ప్రో ఐటీ, ప్రో అర్బన్ ఇమేజ్ ఉండేది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి వచ్చిన తర్వాత ఆయన ఒక ఇమేజ్ కోసం తాపత్రయ పడ్డారు. ప్రో పూర్, ప్రో రూరల్, ప్రో అగ్రికల్చర్ అన్నారు. కానీ ఇవాళ కేసీఆర్ సర్కార్‌లో అరుదైన సమతుల్యత కనబడుతుంది. వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతున్నాయి. మూడున్నర కోట్ల మెట్రిక్ టన్నులకు పండించే స్థాయికి ఎదిగాం. అన్నపూర్ణగా మారింది తెలంగాణ. 2014లో ఐటీ ఎగుమతులు 56 వేల కోట్లు ఉండే. అక్కడి నుంచి 2 లక్షల 41 వేల కోట్లకు పెరిగింది. హైదరాబాద్, ద్వితీయ శ్రేణి పట్టణాల్లో ఐటీని విస్తరించాం. ఐటీ ఉద్యోగుల సంఖ్య తెలంగాణలో 10 లక్షలకు చేరుకుంది. ఒక వైపు వ్యవసాయం, మరో వైపు ఐటీని అభివృద్ధి చేశాం. పరిశ్రమలు పెరుగుతున్నాయి. పర్యావరణం పెరుగుతుంది. హరితహారం ద్వారా 7.7 శాతం గ్రీన్ కవర్‌ను పెంచాం. గ్రీన్ బడ్జెట్ పెట్టి, చట్టాలు చేసి చెట్లు కాపాడాలని ఆదేశించాం. ఉద్యోగాలు పోతాయని హెచ్చరించాం. భవిష్యత్ తరాల కోసం హరితాన్ని పెంచే ప్రయత్నం చేశాం. పర్యావరణహితంగా ఉండే పరిశ్రమలను ఎంకరేజ్ చేశాం. 24 వేల పరిశ్రమలు వచ్చాయి. లక్షల ఉద్యోగాలు కల్పించాం. ఆ విధంగా రూరల్ డెవలప్‌మెంట్, అర్బన్ డెవలప్‌మెంట్, వ్యవసాయం, ఐటీ, వెల్ఫేర్.. ఈ అరుదైన సమతుల్యత కనబడేది మన తెలంగాణలోనే మాత్రమే అని కేటీఆర్ పేర్కొన్నారు.

### ఫాక్స్‌కాన్ కంపెనీని బెంగళూరుకు తరలించేందుకు కాంగ్రెస్ కుట్ర

రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు అవుతున్న ఫాక్స్‌కాన్ కంపెనీని బెంగళూరుకు తరలించేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఫాక్స్‌కాన్ కంపెనీకి లేఖ రాయడంపై కేటీఆర్ ధ్వజమెత్తారు. ఫాక్స్‌కాన్ కంపెనీ ఆపిల్ ఫోన్లకు సంబంధించిన అనేక పరికరాలు తయారు చేస్తోంది. చైనాలో 15 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించింది. మనం కష్ట పడి నాలుగేండ్లు వెంబడి పడి తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఒప్పించుకున్నాం. వివిధ వేదికల్లో అమెరికా, చైనా తైవాన్‌లో కలిసిన తర్వాత 2022లో ఫాక్స్ కాన్ చైర్మన్ హైదరాబాద్‌కు వచ్చి సీఎం కేసీఆర్‌ను కలిసి ఫ్యాక్టరీ పెడుతాం అని ప్రకటించారు. ఒక లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదురుగా కొంగరకొలాన్‌లో 200 ఎకరాల స్థలంలో నిర్మాణం ప్రారంభించారు. రెండు అంతస్తులు పూర్తయ్యాయి. వచ్చేఏప్రిల్, మే నెలలో ఫాక్స్ కాన్ కంపెనీ ప్రారంభం కా నుంది అని కేటీఆర్ తెలిపారు. అయితే కర్ణా టక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఫాక్స్ కాన్ కంపెనీకి అక్టోబర్ 25న లేఖ రాశారు. ఆపిల్ ఎయిర్ పాడ్స్ ఇండస్ట్రీని హైదరాబాద్ నుంచి బెంగళూరుకు మార్చండి. తొందరల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడబో తోంది. హైదరాబాద్ నుంచి పరిశ్రమలను కాంగ్రెస్ ప్రభుత్వాన్నిఒప్పించిబెంగళూరుకు తరలిస్తాం.

# మరోమారు బిఆర్ఎస్ సెంటిమెంట్ ప్రయోగం

తెలంగాణ ఎన్నికల వేడి రాజుకుంటున్న కొద్దీ ప్రచారంలో కొత్తకొత్త అంశాలు తెరపైకి వస్తున్నాయి. విమర్శలు హద్దులు దాటుతున్నాయి. మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ దిశగా బిఆర్ఎస్ మెల్లగా అడుగులు వేస్తోంది. తెలంగాణ వ్యతిరేకులంతా ఏకమవుతున్నారన్న వాదన తెరపైకి తెస్తోంది. ఎవరు వ్యతిరేకులో ఎవరు అనుకూలురో చర్చించాలి. ఎన్నికల ప్రచారంలో చర్చలు విపరీత ధోరణికి తీయరాదు. ఈ క్రమంలో అటు కాంగ్రెస్, ఇటు అధికార బిఆర్ఎస్ ప్రచారంలో విమర్శల తీవ్రత పెరుగుతోంది. ప్రధానంగా కాంగ్రెస్ లక్ష్యంగా బిఆర్ఎస్ చేస్తున్న విమర్శలు హద్దులు దాటుతున్నాయి. రాహుల్‌ను ముద్ద పప్పు అంటూ.. రేవంత్‌ను పప్పు అంటూ మంత్రి కెటిఆర్ చేస్తున్న విమర్శలు హద్దులు దాటాయనే చెప్పాలి. ఇకపోతే కాంగ్రెస్, బీజేపీ ముసుగులో తెలంగాణ ద్రోహులందరూ ఒక్కటవుతున్నారని మంత్రి హరీశ్‌రావు తాజాగా ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటైతే భోజనం మానేస్తానన్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బీజేపీతో జతకట్టారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్‌తో కలిసిపోతున్నారు. రాష్ట్రంలో ఓట్లు చీలకుండా చేసి, తద్వారా బీఆర్ఎస్‌కు నష్టం కలిగించేలా టీడీపీ పోటీ నుంచి తప్పుకుంది. ఇలా తెలంగాణ ద్రోహులందరూ ఒక్కటై కుట్రలతో మన మీదకు దాడికి వస్తున్నారని హరీష్ రావు తాజా రాజకీయాల నేపథ్యంలో మరోమారు సెంటిమెంట్ ఎత్తుకున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కూడా తెలంగాణ వ్యతిరేకి అని, గతంలో ఆయన తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీతో దాడికి యత్నించారన్నారు. తెలంగాణ వ్యతిరేకులతో రేవంత్‌రెడ్డి దోస్తీ చేశారని, పదవిని త్యాగం చేయకుండా పట్టుకుని వేలాడారని విమర్శించారు. అదే దారిలో బీజేపీ నేత కిషన్‌రెడ్డి నడిచారని, వీరందరి తో మనకు పోటీయా అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ కోసం నిలబడిన నిఖార్సైన కేసీఆర్‌తో తెలంగాణ వ్యతిరేకులు పోటీ పడుతున్నారన్నారు. ఇక కాంగ్రెస్ గెలిస్తే అభివృద్ధి ఆగిపోతుందని నిన్న మొన్నటి వరకు ప్రచారం చేస్తూనే తాజాగా కొత్తగా ఈ పల్లవి అందుకున్నారు. నిజానికి తెలంగాణ ద్రోహులను చేర్చుకున్నదే కెసిఆర్. వారంతా ఆయన మంత్రివర్గంలో ఉన్నారు. ఉద్యమకారులంతా బయట ఉన్నారు. వారికి ఎక్కడా చోటులేదు. ప్రాణత్యాగం చేసిన వారి కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయి. కెసిఆర్ కుటుంబం మాత్రమే అధికారం అనుభవిస్తోంది. ఇది ముమ్మాటికీ నిజం అంటూ కాంగ్రెస్,బిజెపిలు ఎప్పటినుంచో ఆరోపిస్తున్నాయి. దీనికి ఎలాంటి సమాధానం లేదు. తెలంగాణ ప్రజలంతా తమ కుటుంబమే అంటున్న కెటిఆర్..ఏ ఒక్క కుటుంబాన్ని ఎందుకు దగ్గర రానీయడం లేదో చెప్పాలి. కెసిఆర్ పాలనా కుటుంబంలో వీరే ఎందుకు ఉండాలి. మిగతా వారెందుకు బయట ఉండాలి. వారంతా కెసిఆర్ కుటుంబంలో ఉంటే ఎందుకు ప్రగతి భవన్‌కు దూరంగా ఉండాలో కెటిఆర్ సమాధానం చెప్పాలని బిజెపి నిలదీస్తోంది. తెలంగాణ ఇచ్చినందుకు సోనియాకు, రాహుల్‌కు కృతజ్ఞతలు చెప్పిన కెసిఆర్ ఇప్పుడు వారిని పప్పు అంటూ విమర్శించడం హుందాగా అనిపిస్తుందా ఆలోచించాలి. రాజకీయాల్లో హుందా విమర్శలు ఉండాలి.. ఇకపోతే తెలంగాణలో పాలనకు బ్రాండ్ తామే అన్న విధంగా..కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ ఆగమవుతుందని ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. రాష్ట్రంలో పాత కష్టాలు మళ్లీ మొదలవుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోవైపు హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో పడిన కరెంటు, నీటి కష్టాలు, మళ్లీ వస్తాయని హెచ్చరించారు. ఒక్కచాన్స్ అంటూ జనం ముందుకొస్తున్న ఆ పార్టీకి గతంలో 11 సార్లు అవకాశమిస్తే ఏం చేసిందో చెప్పాలంటున్నారు. నిజానికి నిజానిజాలు నిర్భయంగా మాట్లాడుకోవాలి. నిజానికి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు

అపనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని ఎక్కడా చర్చించడం లేదు. పదేళ్లలో తాము చేసిందే గొప్ప అని ప్రచారం చేసుకుంటున్నారు. తాము ఎన్నో ప్రయాసల కోర్చి.. రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని, అవినీతికి తావులేని ధరణిని తీసుకొస్తే దాన్ని రద్దు చేసి బంగాళాఖాతంలో పడేస్తామని కాంగ్రెస్ చెబుతోందంటున్నారు. రైతుబంధు దండుగ కాంగ్రెస్ నేతలు అంటున్నారని, ధరణిని తీసివేస్తే రైతుబంధు, రైతుబీమా ఎట్లా వస్తాయన్న ప్రశ్న లేవనెత్తుతున్నారు. పహాణీ నకల్ పేరు మీద మళ్లీ వీఆర్వోలు, ఎమ్మార్వోలు వస్తారని, వసూళ్లు చేస్తారని.. జలగల్లా పట్టి పీడించే దళారుల రాజ్యం ఏర్పడుతుందని ప్రజలను భయాలకు గురిచేస్తున్నారు. రైతుబంధుపై ప్రపంచవ్యాప్తంగా అభినందనలు వచ్చాయని, కేవలం కాంగ్రెస్ నేతలే దుబారా అంటున్నారని కెసిఆర్ విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎవరికి తోచిన విధంగా వారు మాట్లాతున్నారంటూ వారిపై దుమ్మెత్తి పోస్తున్నారు. నిజానికి రైతుబంధులో విపరీతమైన దోపిడీ జరగుతోంది. భూస్వాములకు కూడా రైతుబంధ ద్వారా వందల కోట్లు హారతి పట్టి అప్పగిస్తున్నారు. ఈ దుబారా వల్ల గత కొన్నేళ్లుగా వేలకోట్లు భూకామందులకు చేరింది. ఈ నష్టానికి బాధ్యులు ఎవరు. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బును దుబారా చేయడం తగదని ఎందుకు ఆలోచన చేయడం లేదు. కేవలం బీదరైతులను మాత్రం ఆదుకుంటే ఎవరికి అభ్యంతరం ఉండదు. ఇకపోతే ధరణి వల్ల ఎందరికో అన్యాయం జరిగింది. ఈ అన్యాయాలను ప్రశ్నిస్తే ఎందుకు సరిదిద్దుకోరో చెప్పాలి. అంతేగానీ తెలంగాణ వ్యతిరేకులు అంటూ కాంగ్రెస్, బిజెపిలను విమర్శిస్తే ప్రజలు హర్షించరు. ఎందుకంటే ఈ రెండు పార్టీలే కీలక నిర్ణయం తీసుకుంటేనే తెలంగాణ ఏర్ప డింది. ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్, విపక్షంలో ఉన్న బిజెపిలు అంగీకరించడం వల్లనే తెలంగాణ ఏర్పడ్డది. తెలంగాణ వల్ల ఎక్కువగా లబ్ది పడ్డది కెసిఆర్ కుటుంబం అయితే..నష్టపోయింది మాత్రం తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన వారి కుటుంబాలు.. పోరాడిన తెలంగాణ వాదులు మాత్రమే.

మంత్రివర్గంలో తెలంగాణ వ్యతిరేకులనంతా పోగేసుకున్న కెసిఆర్ ప్రజలకు ఎందుకు సమాధానం చెప్పరు.

# "సునామీ" లపై అవగాహన అవసరం

## "విజ్ఞాన వాహిని" భాగ్య నగరానికి గర్వ కారణం



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

### నవంబర్ 5... ప్రపంచ సునామీ అవగాహన దినం సందర్భంగా

సునామీలు అరుదుగా సంభవిస్తాయి. వస్తే మాత్రం మానవాళికి అమితంగా నష్టం చేకూరుస్తాయి. క్షణాల్లో ప్రాణాలను కబళిలిస్తాయి. ఊరూవాడ మొత్తాన్ని ఏకం చేస్తాయి. భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టానికి కారణ భూతాలు అవుతాయి. సునామీ లపై ప్రజలలో అవగాహన స్థాయి పెంచేందుకు ప్రతియేటా నవంబర్ 5న ప్రపంచ సునామీ అవగాహన దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్య సమితి పిలుపు నిచ్చింది. క్రీ.పూ. 426 ఆరంభంలో గ్రీకు చరిత్ర కారుడు తుసైదిదేస్ తన పుస్తకం పెలిపొంనేసియన్ యుద్ధ చరిత్రలో సునామి కలుగచేసే కారణముల గురించి చర్చించి, అవి భూకంపం వల్లే సంభవిస్తాయని చెప్పాడు.ప్రపంచ వ్యాప్తంగా వందేళ్లలో 58 సునామీలు సంభవించాయి. రెండున్నర లక్షల మంది మృత్యువాత పడ్డారు. 2004లో వచ్చిన సునామీతో సుమారు 2,40,000 మంది వరకు అసువులు బాసారు. మరో 48,000 మంది కనిపించకుండా పోయిన విషయం విదితమే. ఈ సునామీ 14దేశాల వారిని ప్రభావితం చేసింది. అంతకు ముందు 1960 మేలోనూ, 1945 నవంబర్‌లోనూ సునామీలు సంభవించాయి. జపాన్ కు చెందిన గోహి అనే రైతు 1985లో సముద్రం వెనక్కి వెళ్లడాన్ని గుర్తించాడు. శబ్ద తరంగాల్లో మార్పును గమనించాడు. దీంతో సునామీ రాబోతుందని గుర్తించాడు. ప్రజలకు హెచ్చరిక చేయడానికి తన వరిపొలం మొత్తాన్ని తగుల బెట్టాడు. ఈ మంటల ద్వారా ప్రజలు రానున్న ఉపద్రవాన్ని గుర్తిస్తారని భావించి రైతు ప్రజల ప్రాణరక్షణకు పూనుకున్నాడు. ఇలా ఆయన ప్రేరణతో "వరల్డ్ సునామీ అవేర్నెస్ డే" వచ్చింది. అప్పటి వరకు సునామీపై ముందస్తు సమాచారం అందించే కేంద్రం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేదు. దీంతో భారత ప్రభుత్వం కూడా తేరుకుని సునామీ హెచ్చరిక కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అప్పటికే ఇంకాయిస్ ద్వారా మహా సముద్ర సమాచార సేవలు అందుతుండడంతో దీనికి అనుబంధంగానే సునామీ హెచ్చరిక కేంద్రం నెలకొల్పింది. 2005 నుంచి 2007 వరకు ఆపరేషన్ ప్రక్రియ కొనసాగింది. 2007లో పూర్తి స్థాయిలో "ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టం" కేంద్రంగా అవతరించింది.




మత్స్యకారులకు ఉపయోగకర సేవల కోసం హైదరాబాద్ లో 1999లో ప్రగతినగర్ సమీపంలో పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ (పీఎఫ్జెడ్)గా ఇంకాయిస్ ఆవిర్భవించింది. సునామీకి ముందు మొదట సముద్రంలో భూమి కంపిస్తుంది. అలా భూప్రకంపనలు జరిగిన 5%--%6 నిమిషాలకు ఇంకాయిస్ కు సమాచారం అందుతుంది. సముద్ర భూభాగంలో అమర్చిన సిస్మో మీటర్ల ఆధారంగా శాటిలైట్ ద్వారా భూకంపనలు జరిగిన సమాచారం ఇంకాయిస్ కు చేరుతుంది. ఆ తర్వాత భూకంపం ప్రభావంతో సునామీ ఉత్పన్నమయ్యే అవకాశం ఉందా? లేదా? అనే దానిపై దృష్టి సారిస్తారు. సముద్ర జలాలకు కొద్ది కి.మీ దూరంలో ఏర్పాటుచేసిన 'సునామీ బోయ్ నెట్వర్క్' పరికరాల ఆధారంగా కెరటాల ఎత్తు, వాయు దిశను పరిశీలించి సునామీని గుర్తిస్తారు. సునామీ అన్న పదం జపనీస్ భాషకు చెందింది. హార్బర్ కెరటం అని దీని అర్థం. సునామీలు ఏర్పడినప్పుడు రాకాసి అలలు 100 అడుగుల ఎత్తు వరకు వెళతాయి. పసిఫిక్ మహాసముద్రంలో రింగ్ ఆఫ్ ఫైర్ కారణంగానే 80 శాతానికి పైగా సునామీలు సంభవిస్తున్నాయి.సునామీ అలలు గంటకి 805 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఒక జెట్ విమానం స్పీడ్‌తో ఇది సమానం. ప్రపంచంలో జపాన్ తర్వాత అమెరికాలోని హవాయి, అలస్కా, వాషింగ్టన్, ఒరెగాన్, కాలిఫోర్నియాకు సునామీ ముప్పు ఎక్కువ. అందులో హవాయి దీవులకి ఉన్న ముప్పు మరెక్కడా లేదు. ప్రతీ ఏడాది అక్కడ సునామీ సంభవిస్తుంది. ప్రతీ ఏడేళ్లకి తీవ్రమైన సునామీ ముంచేస్తుంది.హిందూ మహాసముద్రంతో అనుబంధంగా ఉన్న 28 దేశాలకు సునామీ హెచ్చరికలు మన హైదరాబాద్ నుంచే వెళ్తుంటాయని చాలా మందికి తెలియని విషయం. సముద్రాల్లో ఏర్పడే భూప్రకంపనల నుంచి సునామీ రాక.. సముద్రపు అలల ఎత్తు.. వేగం.. వాటి తీవ్రత ఏమేర ఉంటుందో నిమిషాల్లో భారత్ తో పాటు ఆయా దేశాలకు చేరవేసే 'విజ్ఞాన వాహిని' భాగ్యనగర సొంతమనే విషయం గర్వకారణం. నగర కీర్తి కెరటంగా 'ఇంకాయిస్' (భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవా కేంద్రం) పరిఢ విల్లుతోంది. ప్రపంచంలో మూడు దేశాల్లో సునామీ హెచ్చరిక కేంద్రాలు ఉంటే అందులో హైదరాబాద్ లోని ఇంకాయిస్ ఒకటి. మిగతా రెండు ఇండోనేషియా, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నాయి. సముద్రంలో చేపలు ఎక్కువగా లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించి వారికి చేరవేసే కేంద్రంగా మాత్రమే ఉండేది. ఆ తర్వాత కొద్ది కాలానికి "ఓషియన్ స్టేట్ పోర్కాస్ట్ సేవలను" ప్రారంభించింది. సముద్ర భాగంలో వాయు దిశ, అలల వేగం, వాటి ఎత్తు, ఉష్ణోగ్రత వివరాలను అందించే సేవలకు అంకురార్పణ చేసింది. సునామీ, సముద్ర విపత్తులపై ఇంకాయిస్ విస్తృతమైన అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో సునామీ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. సునామీ వచ్చే సమయంలో సంకేతాలు ఏవిధంగా ఉంటాయి, ప్రకృతి పరంగా జరిగే మార్పులు, ప్రమాదం నుంచి బయట పడేందుకు అనుసరించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తోంది.ఆయా ఆధునిక పరికరాల ద్వారా సునామీ రాకను గుర్తించడమే కాకుండా తీరాన్ని ఎంత సమయంలో చేరుకుంటుంది, ఎంత ఎత్తులో కెరటాలు వస్తాయి, దాని తీవ్రత ఏమేర ఉంటుందో ఇంకాయిస్ అంచనా వేస్తుంది. అలా సేకరించిన సమాచారాన్ని జిల్లా స్థాయిలో ఉండే డిస్ట్రిక్ ఎమర్జెన్సీ సెంటర్లు, రాష్ట్ర స్థాయిలో ఉండే ఎస్ఈఓసీ (స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్), జాతీయ స్థాయిలో ఉండే ఎన్డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ), ఎంహెచ్ఏ (మినిస్ట్రీ ఆఫ్ హోం సైన్సెస్)లకు వెబ్సైట్, మెయిల్, ఎస్ఎంఎస్ ల ద్వారా కేవలం పది నిమిషాల లోపే చేరవేస్తుంది. మూడు స్థాయిల్లో ఇంకాయిస్ సమాచారం అందిస్తుంది. వార్నింగ్, అలర్ట్, వాచ్ స్థాయిల్లో సందేశం పంపుతుంది.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

'ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుట కు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు...

-ఎడిటర్

# ఆస్మాసిస్



అమ్మా! అమ్మా! అరుస్తూ లోపలకు వచ్చాడు శ్రీకర్, వంటింట్లో సుజాత వంట చేస్తూ "ఏమిట్రా ఆ అరుపులు" అన్నది. "అమ్మా నాకివాళ బిర్యానీ చేస్తావా ఆశగా అడిగాడు అకర్.స్టవ్ మీదున్న పప్పు దించి సాంబారు కలుపుతూ అన్నది సుజాత "రేపు చేసి పెడతాను లేరా. ఈ రోజు హాస్పిటల్ కు వెళ్ళాలి కదా! ? త్వరగా వంటంతా పూర్తి చెయ్యాలి." శ్రీకర్ నిరాశగా వెలహం పెట్టాడు."అమ్మా ఇప్పుడు హాస్పిటల్ కు ఎందుకు వెళ్ళటం ఎవరికేమయింది" అడిగాడు ఆశ్చర్యంగా శ్రీకర్, మొన్న ఊరి నుంచి నాన్నమ్మ వచ్చింది కదా! నాన్యమ్మను హాస్పిటల్ కు తీసుకెళ్ళాలి రా ! అందుకే త్వరగా వంట చేసేస్తున్నాను అన్నది సుజాత.రమేష్ ఆఫీసు నుంచి ఇంటికి వచ్చాడు. "త్వరగా బయలు దేరండి మిమ్మల్ని హాస్పిటల్ దగ్గర వదిలిపెట్టి నేను మందు ఆఫీసుకు వెళ్ళాలి అంటూ తల్లినీ, భార్యని తొందరపెట్టాడు.

అందరూ కలసి ఆటో ఎక్కి హాస్పిటల్ వెళ్ళారు. అక్కడకు వెళ్ళాగానే రమేష్ డయాలసిస్ రూమ్ ఎక్కడ? అని అడిగాడు అక్కడి కాంపౌండరు ను. అతడు ఒక రూమ్ చూపించగానే అక్కడికి వెళ్ళారు. శ్రీకర్ వాళ్ళ నాన్నమ్మను రూమ్ లోపలికి తీసు కెళ్ళారు. రమేష్ డాక్టర్ తో మాట్లాడి వచ్చాడు.బయటకు వచ్చి భార్యతో ఇలా అన్నాడు "సుజాత నేను డాక్టర్ తో అంతా మాట్లాడాను. నాలుగైదు గంటలు పడుతుంది అట. ఇక్కడే ఉండండి. డయాలిసిస్ అయిపోయాక నాకు పోన్ చెయ్యి". రమేష్ శ్రీకర్ తో "శ్రీకర్ నువ్వు అమ్మకు తోడుగా ఉండు" అని చెప్పి బయటకు వెళ్ళిపోయాడు. శ్రీకర్ భయభయంగా అమ్మ వెంట తిరుగుతున్నాడు శ్రీకర్ 7 వ తరగతి చదువుతున్నా, చిన్నపిల్లల్లాగే హాస్పిటల్ అంటే భయపడతాడు. శ్రీకరేంటి ఎవరైనా పెద్దవాళ్ళు కూడా హాస్పిటల్ అనగానే వెనకడుగు వేస్తారు. అక్కడ చేసే ఇంజకన్లకు సైతం భయపడతారు.అంతలో వీళ్ళను డాక్టరు లోపలికి పిలిచాడు. చూడండి ! ఇదంతా పూర్తవడానికి నాలుగైదు గంటలు పడుతుంది. మీరు బయట కూర్చోండి. మేం జాగ్రత్తగా చూసుకుంటాం. డయాలిసిస్ అంటే భయపడాల్సిందేమీ లేదమ్మా! అని డాక్టరు సుజాతకు చెప్పాడు.శ్రీకర్ మెల్లగా వాళ్ళమ్మతో దయాలసిస్ అంటే ఏమిటమ్మా? ఎందుకు నాన్నమ్మకు చేస్తున్నారు" అన్నాడు. సుజాత "ష్ మాట్లాడకు" అంటూ నోటి మీద వేలు పెట్టి సైగ చేసింది."చూడు బాబూ ! మనిషి దేహంలో ఉండే కిడ్నీలు చెడిపోతే దయాలిసిస్ చేయవలసి వస్తుంది. కిడ్నీలు మనిషిలో ఉండే రక్తాన్ని శుద్ధి చేస్తాయి. మరి కిడ్నీలు చెడిపోవటం వలన దాని పని అది చేయలేక పోతుంది. అందుకని కిడ్నీ చేయవలసిన పనిని ఇదిగో ఈ మిషను చేస్తుందన్నమాట. మీ నానమ్మ వంట్లోని రక్తమంతా బయటకు తీసి ఈ మిషనేలోకి పంపుతాము. ఈ మిషన్ ఆ రక్తాన్ని మొత్తం శుభ్రం చేసి ఉంచుతుంది. శు భ్రపడిన ఈ రక్తం మొతాన్ని మరల మీ నాన్నమ్మ ఒంట్లోకి పంపిస్తాయి. ఇది దయాలిసిస్ అంటే! అర్థ అయిందా !" డాక్టర్ చాలా వివరంగా చెప్పాడు. శ్రీకర్ చాలా ఆశ్చర్యంగా నోరు తెరుచుకుని విన్నాడు. అందులో రక్తం మొత్తం బయటకు తీసి మరల రక్తం మొత్తం లోపలికి పంపటం అనే పక్రియ చాలా ఆశ్చర్యంగా అనిపించింది. మళ్ళీ మెల్లగా వాళ్ళమ్మకి మాత్రమే వినబడేలా ఇదంతా ఎలా జరుగుతుందని ప్రశ్నించాడు శ్రీకర్. వాళ్ళమ్మ కోపంగా కళ్ళు పెద్దవి చేసి చూసింది."నన్నడుగు చెపుతాను" అన్నాడు డాక్టరు. సుజాత ఆశ్చర్యపోతున్నది. మామూలుగా రెండో మాటకే అవకాశం ఇవ్వని డాక్టరు ఇన్ని విషయాలు చెబుతున్నాడేమిటా అని ఒకటే ఆశ్చర్యంగా ఉన్నది. ఈరోజు ఏమైందో ఈయనకు అనుకున్నది."నువ్వు ఎన్నో తరగతి చదువుతున్నావు బాబూ" డాక్టరు శ్రీకర్ ను చూసి అడిగాడు. "నేను ఏడవ తరగతి చదువుతున్నాను సార్" గొప్పగా చెప్పాడు శ్రీకర్. "మరి మీ పాఠ్యాంశాలలో 'ఆస్మాసిస్' అనే పదం విన్నావా ? అంటే ఏమిటో తెలుసా? ఏదైనా ఉదాహరణ చెప్పగలవా" వరసగా ప్రశ్నల మీద ప్రశ్నలు అడిగాడు డాక్టర్.శ్రీకర్ మాత్రం ఉత్సాహంగా సమాధానం చెపుతున్నాడు. సార్ మా సైన్స్ పుస్తకంలో 'ఆస్మాసిస్' పాఠం ఉన్నది. మా సైన్స్ మాస్టారు చెప్పారు. "తక్కువ గాఢత గల ద్రావణం నుంచి ఎక్కువ గాఢత గల ద్రావణానికి జరిగే నీటి ప్రయాణయే ఆస్మాసిస్' అని చెప్పారు సార్."వెరీ గుడ్ బాయ్! చదువులో చురుకుగా ఉన్నావు మరి ఉదాహరణ చెపుతావా" అడిగాడు డాక్టరు శ్రీకర్ వైపుకు వంగి.చెప్తాను సార్. మా మాస్టారు స్కూలులో చేసి చూపించారు కదా! మామూలు నీటినీ, ఉప్పు కలిపిన నీటినీ కలిపి ప్రయోగించినపుడు మామూలు నీరు మెల్లగా ఉప్పు నీటిలోకి ప్రయాణించింది" చాలా ఆనందంగా మొహమంతా వెరిగిపోతూ చెప్పాడు శ్రీకర్. వెరీగుడ్ వెరీగుడీ డాక్టర్ శ్రీకర్ మాటలకు, చప్పట్లు కొట్టాడు. "ఇప్పుడు నేను దయాలిసిస్ గురించి చెపుతా విను. అదే ఆస్మాసిస్ ప్రక్రియ వలననే ఇక్కడ రక్తాన్ని వెలుపలికి తీయడం జరుగుతుంది అంటే మలినమైన రక్తం మానవ దేహం నుంచి ఒక పక్క బయటకు వస్తూ ఉంటుంది. మరోవైపు శృద్ధి చేయబడిన రక్తం మిషను నుండి దేహం లోకి పంపబడుతుంది. ఇదంతా ఆస్మాసిస్ వలననే జరుగుతుంది. అర్థమయిందా ఇప్పుడు" అడిగాడు డాక్టరు.శ్రీకర్ చాలా సంతోషంగా ఉన్నాడు. తెలియని విషయాన్ని తెలుసుకున్నాననే ఆనందం శ్రీకర్ మొహంలో కనబడుతోంది.రోజు పేషంట్లతో గడిపే డాక్టరుకు శ్రీకర్ ను చూడగానే విషయమంతా చెప్పాలనిపించింది. తనలోని టీచరీ బయటకు వచ్చాడు . ఇంట్లో తన కొడుకు గుర్తు వచ్చాడు. కాస్త పని కూడా తక్కువ ఉండటంతో శ్రీకర్ కు పాఠం బాగా చెప్పాడు.శ్రీకర్ కు హాస్పిటల్ అంటే భయం పోయింది. డాక్టర్ అంటే అభిమానం పెరిగింది.

-డా. కందేపి రాణీప్రసాద్

# సిరిసిల్లలో కాంగ్రెస్ "గ్రాఫ్" పెంచుకుంటుందా..!

(మొదటిపేజీ తరువాయి)

విమర్శలు గుప్పిస్తూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ లోకి వెళ్లిపోయారు, మరో నేత రమకాంతారావు పొద్దున పార్టీ రాజీనామా చేసిన రెండు మూడు గంటల్లోనే కారు ఎక్కేసారు. కమలం కష్టాల్లో ఉన్నా, జిల్లా, రాష్ట్ర నాయకులు నోరు మెదపకపోవడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగామారింది. మిగిలిపోయిన కొద్ది మంది నాయకులు కూడా స్థానికులకు అవకాశం కల్పించాలనే ప్రతిపాదనలను భారతీయ జనతా పార్టీ నాయకత్వం పట్టించుకోకపోవడంపై అసంతృప్తితోనే ఉన్నట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ సీనియర్ నాయకులు చెప్పారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా రాణి రుద్రమ దేవి, ప్రచారంలో ఉండి నియోజకవర్గం తిరుగుతున్నారు.

## తిరుగుబాటు అభ్యర్థిగా శ్రీనవాస్ ఖాయమేనా?

పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన లెగిసెట్టి శ్రీనివాస్ బిజెపి అభ్యర్థిగా ఖాయం అనుకున్న తరుణంలో అనుహ్యంగా బిజెపి సిరిసిల్ల నియోజకవర్గ అభ్యర్థిగా రాణి రుద్రమ రెడ్డిని ప్రకటించడం దుమారం రేపింది. లగిశెట్టి శ్రీనివాస్ పద్మశాలి సామాజిక వర్గం నుండి స్వతంత్రంగా బిజెపి రెబెల్ అభ్యర్థిగా బరిలో ఉంటారని ప్రకటించారు. పద్మశాలి సామాజిక వర్గం నాయకులతోపాటు, అన్ని సామాజిక వర్గాల నుండి సంవత్సరం నుండి మద్దతు కూడగగట్టుకుని, లాగిశెట్టి శ్రీనివాస్ పోరు సిద్ధమవుతున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో తనకే అవకాశం కల్పిస్తానని చెప్పిన పార్టీ పెద్దలు, ఇతర ప్రాంతాల నేతలను ఎలా తీసుకొస్తారని అంశాన్ని ప్రచారం చేస్తూ సిరిసిల్లలో మెజార్టీ సామాజిక వర్గంగా ఉన్న పద్మశాలీలు, ఇతర వెకబడిన వర్గాలు తనవైపే ఉన్నాయని చెపుతున్నారు. పద్మశాలి సామాజిక వర్గంతో పాటు మిగిలిన సామాజిక వర్గ నేతలుతనతో కలిసి వస్తారనే ఆశాభావంతో తెగించి కొట్లాడేందుకే సిద్ధమవుతున్నట్లు ఇటీవల తన ఆత్మీయుల జరిగిన సమావేశంలో స్పష్టం చేశారు.

## బిఎస్పీ, ఇతర పార్టీలు పోటీలో ఉంటే ?

సిరిసిల్ల నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ నుండి ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన న్యాయవాది పిట్టల భూమేష్ ను వేములవాడ నియోజకవర్గం నుండి తీసుకొచ్చి సిరిసిల్ల నియోజకవర్గ అభ్యర్థిగా బరిలో దించింది. సింహ గర్జన పేరుతో సిరిసిల్ల నిర్వహించిన భారీ బహిరంగ సభలో బీఎస్పీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తో పాటు పిట్టల భూమేష్ లు ప్రజలు ఆదరిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. బి ఎస్ పి కి సిరిసిల్ల నియోజకవర్గంలో ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంకును అధిగమించి ఈ మేరకు ప్రజల నుండి ఫలితాలను రాబడుతుందో చూడాలి.

## పద్మశాలి వర్గమే కీలకంగా మారనుంది

సిరిసిల్ల నియోజకవర్గం 70 వేలకు పైగా పద్మశాలి సామాజిక వర్గం ఓట్లే ఉన్నాయని ఇప్పటివరకు పద్మశాలి వద్ద నుండి ఒక్కరు కూడా శాసనసభకు వెళ్లకపోవడంపై ఆవేదనతో పోటీలో దిగుతున్నట్లు పద్మశాలి యువ నాయకులు పత్తిపాక సురేష్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ముందుకెళుతున్న ఆయన ప్రభావం యువతపై ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. స్వతంత్రంగా బరిలోకి దిగుతున్న సురేష్ కు పద్మశాలి సామాజిక వర్గం ఏ మేరకు అండగా నిలుస్తుందో చూడాలి. వైయస్సార్ టిపి నుండి చొక్కల రాము పోటీలో ఉంటారనుకొన్నా, ఆపార్టీ పోటీ చేయడం లేదని ప్రకటించడంతో , ఆయన పరిస్థితి అయోమయంగా మారింది.

## పంతులు బరిలో ఉంటాడా లేక ప్రక్కకు తప్పుకొంటాడా?

కాంగ్రెస్, భారాస లనుంది విడిపోయి, బిజెపి లో చేరిన కరీంనగర్ మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, హడావిడిగా, కలకత్తా వెళ్లి నేతాజీ స్థాపించిన ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరాడు. ఎన్నికల కమిటీ అధ్యక్షునిగా కూడా నియమితుడు అయ్యాడు. ఆయన స్వగ్రామ గంభీరరావుపేట ఈ నియోజక పరిధిలోనిదే. ముందుగా ఇక్కడి నుండి పోటీ చేస్తానని ప్రకటించినా, ఇప్పటి వరకు ఎలాంటి హడావిడి కనబడడం లేదు. గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమ సంఘం నాయకులు ఇక్కడి నుండి పోటీ చేయాలని భావించినా, ప్రక్కనున్న వేమూలాడ నుండి గుగ్గిల రవిని పోటీలో ఉంచుతున్నారు.

## ప్రభుత్వ వ్యతిరేక వోటు చీలకుండా చూడడంలో ప్రతిపక్షాలు విఫలం

నియోజకవర్గం లో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఓటర్ల సంఖ్య భారీగానే ఉంటుంది. ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి రాము తన మద్దతుతో ఎవరికి ఓట్లు రాబట్టుతారో అన్న చర్చ జరుగుతుంది. దాదాపుగా అన్ని పార్టీల అభ్యర్థుల జాబితాలోంచి జనంలోకి పోతున్న పరిస్థితి కనిపిస్తుంది. నియోజకవర్గం లో కొంతమేరకు ప్రభావం చూపి పరిస్థితిలో ఉన్న కమ్యూనిస్టుల పరిస్థితి ఇంకా డోలాయమానంలోనే ఉంది. ఆ పార్టీలు ఇప్పటివరకు తన వైఖరి స్పష్టం చేయకపోవడం ఆ పార్టీ అభ్యర్థినీ ఎవరైనా రంగంలోకి దించుతుందా అన్నది ఇంకా అస్పష్టంగానే ఉంది. మొత్తానికి సిరిసిల్ల నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ధారించే పద్మశాలి సామాజిక వర్గం ఎటువైపు నిలబడుతుందో అన్న చర్చ నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది.

## అభివృద్ధే ఆయుధంగా కేటీఆర్ ప్రచారం

గజ్వేల్, సిద్దిపేటకు ధీటుగా సిరిశీలలను అభివృద్ధి చేశానని చెప్పుకొనే భారాస కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు(కెటీఆర్), జరగబోయే ఎన్నికల్లో బహుముఖ పోటీని ఎదుర్కోబోతున్నారు. ఇన్నాళ్ళూ ఆయన విజయం నల్లేరు మీది నడకే అనుకున్నా, గతంలో పార్టీలోని కొంత మంది చేసిన తప్పులే ఇప్పుడు ఆయన గెలుపుకు ఆటంకంగా మారాయి. పార్టీలో కొంత మంది చేస్తున్నపెత్తనాన్ని ఎదుర్కొనే వారిని పెట్టిన ఇబ్బందులు, ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన కేసులు ప్రతిబంధకంగా మారనున్నాయని కూడా అనుకొంటున్నారు. కానీ అధికారంలో ఉన్న బలవంతుడైన కేటీఆర్ ను ఎదుర్కోవడం అనుకున్నంత సులువేమీ కాదనే విషయాన్ని ప్రతిపక్షాలు కూడా అంగీకరిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా చూడడంలో విఫలం అయిన ప్రతిపక్షాలు అనుకొన్న లక్ష్యం చేరడం గగన కుసుమాన్ని షసాధించడం లాంటిదేనని అనుకొంటున్నారు.

prajamantalau daily pages (05-11)f_times of varha main (13-2).qxd 11/5/2023 4:52 AM Page 4



## బీజేపీ ఇంటింటి ప్రచారం



**ఇబ్రహీంపట్నం నవంబర్ 04 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు బట్టు జకరయ్య గారి ఆధ్వర్యంలో కోమటి కొండాపూర్ 47.48 బూత్ లలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీ పార్టీ అభ్యర్థి ధర్మపురి అరవిందన్నను గెలిపించాలని అదే విధంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించటం జరిగింది. వర్షకొండ గ్రామంలో లో సీనియర్ బిజెపి నాయకులు ఉప్పులుటి రాజన్న మాజి ఎంపీటీసీ మామిడాల ప్రసాద్ మరియు గౌడ సంఘం నాయకులు రఘురాం గౌడ్, దశరథ్ గౌడ్ లను కలిసి ఇంటింటికి ప్రచారాన్ని ఉధృతం చేయాలనీని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నిజామాబాదు పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ మరియు ఇబ్రహీంపట్నం ఇంచార్జి గుంటుక సదాశివ్ మరియు మండల ప్రధాన కార్యదర్శులు సుంచు రణధీర్, వెంకటేష్ యాదవ్, కార్యదర్శి దగ్గుల అశోక్, బీజేవైఎం మండల అధ్యక్షులు బీద నవీన్ రెడ్డి, కిషన్ మోర్చా అధ్యక్షులు గడ్డం సంజీవ్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఇల్లేందుల చారీ, జిల్లా కిషన్ మోర్చా ఉపాధ్యక్షులు గడ్డం రమేష్, కార్యదర్శి బాయ్ లింగారెడ్డి, కార్యవర్గ సభ్యులు బైన మహేష్, అక్కపెల్లి జలంధర్, బూతు అధ్యక్షులు గడ్డం గంగారెడ్డి, వంశీ, ,శేఖర్, నేరాళ్ల రవి, ముకేశ్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.


## కాంగ్రెస్ పార్టీ లో చేరిన మాజీ జడ్పీటీసీకి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**జమ్మికుంట నవంబర్ 04 (ప్రజామంటలు):** కొత్తపల్లి గ్రామానికి చెందిన మాజీ జడ్పీ టీసీ శ్రీ అరుకాల వీరేశ లింగం నిన్న శుక్రవారం రోజున హైదరాబాద్ లో హుజు రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితెల ప్రణవ్ అధ్వర్యం లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో జాయిన్ అయిన సందర్బంగా వారి స్వగృహం కొత్తపల్లిలో జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న, మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎరబెల్లి రాజేశ్వర్ రావు, మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మోలుగూరి సదయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేయడం జెరిగిం. అరుకాల వీరేశ లింగం మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ నా మాతృపార్టీ అని అన్నారు. నా స్వంత పార్టీ లోకి రావడం చాలా ఆనందంగా ఉందని, గర్వంగా ఉందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం మైనార్టీ కాంగ్రెస్ సెల్ చైర్మన్ ఎండీ. సలీం పాషా, ఎస్‌సి సెల్ చైర్మన్ గొట్టే ప్రభు దాస్, డాక్టర్ మడిపల్లి అశోక్, చిన్నింటి నాగేందర్, చిలువేరు రాజమౌళి, పోతుల శ్రీనివాస్, పందిళ్ళ శంకర్, గుర్రపు ప్రవీణ్, లింగ రావు, గుల్లి సమ్మయ్య, మోలుగురి సమ్మయ్య, సాగర్, బొల్లా కుమార్, ప్రభాకర్, రాజకుమార్, యునస్, ఆకుల రమేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌కు దెబ్బ మీద దెబ్బలు

### అసంతృప్తులు, అలకలు, అంతర్గత కుమ్ములాటలు
### భూపాలపల్లి నియోజకవర్గంలో ఖాళీ అవుతున్న కారు పార్టీ
### ఒక్కొక్కరుగా 'చేతి' కి చిక్కుతున్న నేతలు




**భూపాలపల్లి ప్రతినిధి నవంబర్ 04 (ప్రజామంటలు):** "ఊరందరిది ఒకదారి అయితే ఉలిపిరి కట్టది మరోదారి" అన్న చందంగా మారింది భూపాలపల్లి నియోజకవర్గం లో అధికార బిఅరెస్ పార్టీ పరిస్థితి. పాత కొత్త నేతల మధ్య సయోధ్య లేక పోవడం, వారిలో వారికే ఇగోయిస్టిక్ ఫీలింగ్ లు, వెరసి ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టి ముంచే కాడికి పరిస్థి తులు చేరుకున్నాయి. ప్రస్తుత భూపాల పల్లి అభ్యర్థి 2018 లో జరిగిన ఎన్ని కల్లో అప్పటి శాసన సభాపతి సిరికొండ పై విజయం సాధించడం, తదనంతర పరిణామాల్లో కాంగ్రెసును వీడి అప్పటి టీఆరెస్ లో తన మొత్తం అనుచరగణం తో చేరిన నాటి నుండి నియోజకవర్గ బిఅరెస్ పార్టీలో సిరికొండ, గండ్ర ల వర్గాలుగానే వ్యవహారాలు నడిచాయి, నీవురు కప్పిన నిప్పులా ఉన్న పరిస్థితులు ఎన్నికల సమయంలో అగ్ని పర్వ తం లా ఒక్కసారి బద్దలై అసంతృప్తి సెగలు చిమ్ము తున్నాయి. దీనితో నియోజకవర్గం లో రోజు రోజుకీ బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి వలసలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరి తర్వాత ఒకరుగా కారు పార్టీకి చెందిన నేతలు చేతికి చిక్కుతున్నారు. నియోజవర్గంలో అరె న్నార్ ట్రస్ట్ పేర అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు చేరువైన పోలీస్ అధికారి గత ఎన్నికల్లో బిఆర్ఎస్ టికెట్ ఆశించి దక్కక పోవడంతో ఆ పార్టీకి సానుభూతి పరుడుగా ఉంటూ వస్తున్న మొగుల్లపల్లి మండలా నికి చెందిన కటంగూరి రామ్ నరసింహా రెడ్డి, భూపాలపల్లి పట్టణ బిఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు వ్యాపారవేత్త క్యాత రాజు సాంబమూర్తి లతో పాటు రేగొండ మండలానికి చెందిన డైనమిక్ లీడర్ పుణ్ణం రవి తన సతీమణి ఎంపీపీ లక్ష్మీ లు తమతమ అనుచరులతో కలిసి శనివారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలోనే వారు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఏదిఏమైనా టికెట్ ఆశించి దక్కించుకోలేక పోయిన మాజీ స్పీకర్ సిరికొండ అలకలు ఒక వైపు ఉండగా, ఆయన తనయుడు యువ నాయకుడు ప్రశాంత్ ఆగ్రహ జ్వాలలు చల్లారకముందే లీడర్ల తో పాటు క్యాడర్ పార్టీని వీడుతున్న క్రమంలో విజయావకాశాలు గగన కుసుమమే కానున్నాయి అని విశ్లేషకులు భావిస్తున్నారు.

## మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌పై భారత రాష్ట్ర సమితి "మంటలు"



### బేషరతుగా ఎమ్మెల్యే సతీష్ కు క్షమాపణలు చెప్పాలి
### పొన్నం అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డ భారాస నాయకులు

**భీమదేవరపల్లి నవంబర్ 03 (ప్రజామంటలు):** హుస్నాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పై మండల భారాస నాయకులు మండిపడ్డారు. శుక్రవారం భారాస మండల అధ్యక్షులు మార్పాటి మహేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జెడ్పిటిసి వంగ రవీందర్, ఎంపీపీ అనిత రమేష్ యాదవ్ పొన్నం వ్యాఖ్యలపై మండిపడ్డారు. శుక్రవారం కొత్తకొండ రసుల్ పల్లి గ్రామాల్లో పర్యటించిన పొన్నం ప్రభాకర్ స్థానిక ఎమ్మెల్యే సతీష్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని మండల బారాస నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 15 సంవత్సరాలు పత్తా లేని వ్యక్తి తెలంగాణ రాష్ట్రంలోనే మంచికి మారుపేరు ఉన్న ఎమ్మెల్యే సతీష్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఓర్వలేని తనమని అన్నారు. ఎమ్మెల్యే పై వ్యక్తిగత దూషణలు సరికాదని అన్నారు. బిజెపికి టిఆర్ఎస్ కు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. భారాస క్రమశిక్షణ గల పార్టీ అని వారిలాగా మేము వ్యక్తిగత విమర్శలకు పోమని అది మా సంస్కృతి కాదని అన్నారు. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త కొండ దేవస్థానం చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, మాజీ ఎంపీపీ సంగ సంపత్, ముల్కనూర్ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, సీనియర్ నాయకులు సల్పాల తిరుపతి, మండల సురేందర్, ఎంపీటీసీలు బొల్లంపల్లి రమేష్, అప్పని పద్మ బిక్షపతి, ధార్న శ్రీనివాస్, ఎల్తూరి ప్రభాకర్, మార్పాక శ్రీనివాస్, దొంతరవేన వెంకటేశ్వర్లు, గుడికందుల పున్ని, ఎదలాపురం సంపత్, మోరే సంజీవ్, గడ్డం వెంకన్న, రాచర్ల సంపత్, వేల్పుల సుధాకర్, అంబాల చక్రపాణి, మాడుగుల అశోక్, మేక లాజర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జగిత్యాల జిల్లా వారి కార్యాలయంలో పాల్గొని ఎన్నికల్లో మద్దతు కోరిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి అలాగే రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల పట్టణ అధ్యక్షులు గంగరాజం, ప్రధాన కార్యదర్శి రవీందర్, తదితరులు**



# ఘనంగా చండీమాత శోభాయాత్ర



**జగిత్యాల నవంబర్ 04 (ప్రజామంటలు):** లోక కళ్యానార్థం జిల్లా కేంద్రంలో పద్మనాయక కల్యాణ మండపంలో ఈ నెల 4వ తేదీ శని వారం నుండి 9వ తేదీ గురువారం వరకు శత చండీయాగం బ్రహ్మశ్రీ సభాపతి తిగుళ్ల విషుశర్మ ఆధ్వర్యంలో నిర్వహించబడును. ఈ నేపథ్యం లో శనివారం స్థానిక మార్కండేయ మందిరం నుండి ప్రత్యేక వాహనాల పై గణపతి, పరమశివుడు, చండీమాత విగ్రహాలను శోభాయాత్రగా పట్టణ ప్రధాన వీధుల గుండా మంగళ వాద్యాలతో మంటపం వరకు తీసుకువెళ్లి అధిష్టింప చేశారు. వివిధ సత్సంగాలకు సంబంధించిన మహిళా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని ఒకే రకమైన గణవేషము ధరించి కోలాటాలు నిర్వహిస్తూ శోభా యాత్రను కొనసాగించారు. శోభాయాత్రలో యాగ్నికులు వేద ఘోష తో అమ్మవారి వాహనము ముందుండి శోభాయాత్ర నిర్వహించారు.

## నియోజకవర్గ స్థాయిలో బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు



**జగిత్యాల నవంబర్ 04 (ప్రజామంటలు):** జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామానికి చెందిన బిజెపి నాయకులు అబ్బారి మల్లేశం గౌడ్ 50 మంది నాయకులు, యువకులు చల్ గల్ బిఅర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ గరిమెళ్ళ రాజయ్య, బాలే లక్ష్మణ్, పెగ్గర్ల గంగారాం బిఅర్ఎస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీ కార్యాలయం మోతే రోడ్డు లో పార్టీ లో చేరగా కండువా కప్పి ఆహ్వానించిన జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్.

ఈ కార్యక్రమంలో సర్పం చ్‌లు ఎల్ల గంగ నర్సు రాజన్న, రజిత శేకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసిఫ్, ఉప సర్పంచ్ లు పద్మ తిరుపతి, బొడ్డు బుచన్న, గ్రామ శాఖ అధ్యక్షులు పూదరి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ పులిశెట్టి శ్రీనివాస్, మాజీ ఏఎంసి డైరెక్టర్ మహేష్, షకీల్, షేర్, శేఖర్, చందు, మహేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంకు

# రూ. 1,00,116 విరాళం





**కొడిమ్యాల అక్టోబర్ 04 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ మునకు కొడిమ్యాల గ్రామానికి చెందిన వేల్పుల తిరుపతి-పద్మ కుమారుడు సంజయ్ కూతురు మధుమిత తల్లి మల్లవ్వ ల కుటుంబం ఆలయ నిర్మాణానికి "మహా రాజపోషకులు"గా 1,00,116 (ఒక లక్ష నూట పద హారు)ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయానికి ధన రూపేనా దాతలకు అర్చకులు నాగరాజు రమేష్ స్వామి వారి తీర్థ ప్రసా దములు అందజేసి మంగళ శాసనములతో ఆశీర్వదించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతల కుటుంబానికి గ్రామస్తుల తరఫున నిర్మాణ కమిటీ తరఫున భక్తుల తరఫున ప్రత్యేక ధన్యవాదములు.

### ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ లో

## 'తిరుణహరి ప్రతిమ' కు డాక్టరేట్



**హుజూరాబాద్ నవంబర్ 04 (ప్రజామంటలు):** రాజస్థాన్ రాష్ట్రంలోని ప్రసిద్ధ మేవార్ యూనివర్సిటీ నుండి హన్మకొండ జిల్లా ఓగులాపూర్ లోని కేర్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాల లో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్, హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన తిరుణ హరి ప్రతిమకు ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో శుక్రవారం డాక్టరేట్ (పి.హెచ్.డి) అవార్డు లభించింది. తిరుణ హరి ప్రతిమ సమర్పించిన పరిశోధనా వ్యాసం "డిజైన్, డెవలప్ మెంట్ అండ్ స్క్రీనింగ్ ఫర్ పాసిబిల్ ఫార్మకలాజికల్ ఆక్టివిటీస్ ఆఫ్ నావెల్ నైట్రోజన్ అండ్ ఆక్సిజన్ కంటేయినింగ్ హెటెరో సైక్లిక్ కాంపౌండ్స్ " అనే అంశంపై యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. టి. రామమోహన్ రెడ్డి పర్యవేక్షణలో 2023లో థీసిస్ సమర్పించారు. తిరుణహరి ప్రతిమ డాక్టరేట్ అవార్డు అందుకున్న సందర్భంగా కుటుంబ సభ్యులు, మిత్రులు, కళాశాల బృందం అభినందనలు తెలియజేశారు.

## నవంబర్ 11, న చలో హైదరాబాద్

### ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలి
### మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రం ఆవిష్కరణ




**జగిత్యాల నవంబర్ 04 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ లో ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్, ఎంజెఎఫ్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో "మాదిగల విశ్వరూప మహా సభ" కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఎస్సీ లలో ఉండే 59 ఉపకులాలకు విద్య, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ రంగాలలో జనాభా దామాషా ప్రకారం సమాన వాటా పంపిణీ జరగాలంటే ఎస్సీ వర్గీకరణ తప్పనిసరి వర్గీకరణ ఆవశ్యకతను వివరించి దీనికి మంద కృష్ణ మాదిగ 29 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ పోరాటం వల్ల నే సాధించిన సంక్షేమ పథకాలను తెలియజేసి వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో నే ఎస్సీ రిజర్వేషన్ ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్ తో నవంబర్ 11, న లక్షలాది మందితో మాదిగల విశ్వరూప మహాసభను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మహా సభకు ముఖ్య అతిధిగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వస్తున్నందున మన జాతి ఆవేదను చాటి చెప్పాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందని అన్నారు. మన భవిష్యత్తు కొరకై విశ్వరూప మహాసభకు ప్రతి ఒక్కరు తరలి రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం, ఎంజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,కో కన్వీనర్ బెజ్జంకి సతీష్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ సురుగు శీను, కో కన్వీనర్ బలవంతుల సురేష్, జగిత్యాల నియోజకవర్గ కన్వీనర్ బోనగిరి కిషన్, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు లక్ష్మీరాజ్యం, దయ్యాల అనుమంతు, బంగారు ప్రమోద్, కుంటాల శ్రీనివాస్, పెంబట్ల మీసాల సాయిలు, చిర్ర లక్ష్మణ్, న్యాయవాది నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ చైర్పర్సన్ ఆధ్వర్యంలో మండల మున్నూరు కాపు కు ఆత్మీయ సమావేశం

### ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కుమార్ కు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఏకగ్రీవ తీర్మానం





**రాయికల్ నవంబర్ 04 (ప్రజామంటలు):** రాయికల్ పట్టణంలో రాయికల్ పట్టణ మరియు మండల మున్నూరు కాపు కుల బాంధవులతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న జిల్లా జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్. ఈ సందర్భంగా మూడోసారి సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ మరియు జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కుమార్ పూర్తి మద్దతు ఇస్తామని ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది. ఈ సమావేశంలో రాయికల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోల శ్రీనివాస్, సర్పంచ్లు పాదం రాజు,నీలి మల్లయ్య,ఆకుల లక్ష్మీనారాయణ, బెజ్జంకి రమాదేవి మోహన్, పాక్స్ చైర్మన్ దీటి రాజారెడ్డి, ఉప సర్పంచ్లు మల్లేశం, సాయిరెడ్డి,ఎక్స్. ఏఎంసి వైస్ చైర్మన్ కొల్లూరి వేణు, అత్తినేని సాయిరెడ్డి, కోల రాజు, పడాల సత్యం, మరియు మున్నూరు కాపు నాయకులు, కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని విస్మరించిన కెసిఆర్ ను గద్దే దింపుదాం!

### ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వుట్కూరి ప్రణీత్ గౌడ్




**ఎల్కతుర్తి నవంబర్ 04 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ ప్రెస్ మీట్ కు హాజరైన ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు వుట్కూరి ప్రణీత్ గౌడ్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని.... 1200 వందల మంది త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ. దాని భోగాలు ఒక కుటుంబం మాత్రమే అనుభవిస్తుందని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్య సంస్థల్లో అనేకరకాల మౌలిక సదుపాయాలు లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని. కనీసం విద్యార్థులకు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ ఇచ్చిన పాపాన ఈ ప్రభుత్వం పోలేదని... అదేవిధంగా నిరుద్యోగులను కెసిఆర్ సర్కార్ నమ్మించినట్టేట ముంచిందని విద్యారంగ సమస్యలు, ప్రజా సమస్యలు, కార్మిక సమస్యలు గాలికి వదిలేసి కేవలం ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్లు ఈ బిఆర్ఎస్ ప్రభుత్వం దుర్వినియేగం చేసిందని అదేవిధంగా కేంద్రంలో ఉన్న బిజెపి దేశ సంపదను మొత్తం ఎల్ఐసి, రైల్వే, ఎయిర్ ఇండియా లాంటి అనేక ప్రజా సంస్థలను అదానికి అప్పజెప్పి దేశాన్ని కాజేస్తుందని ఇట్లాంటి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్, బిజెపి లకు తగిన బుద్ధి చెప్పాలని నిత్యం పేద బడుగు బలహీన వర్గాల కోసం కొట్లాడుతున్న పార్టీలకే ఓట్లు వేసి గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు ముంజ పూర్ణ గౌడ్, మాచర్ల రాజాగౌడ్, వి. సురేష్, మండ సాయిప్రభాస్, ఎం. సహర్ష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చా

# వావిలాల ని మండలం చేసి చూపిస్తా



ఎంఎల్సీ కౌశిక్ రెడ్డి

**జమ్మికుంట నవంబర్ 04 (ప్రజామంటలు):** నేను రాజకీయాల్లోకి వచ్చిందే మీ మొహంలో చిరునవ్వు చూడడం కోసమని, ఒక్క అవకాశం ఇచ్చి నన్ను గెలిపిస్తే హుజురాబాద్ నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని హుజురాబాద్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జమ్మికుంట లోని నగరం, నగురం, వావిలాల, పాపక్కపల్లి గ్రామాల్లో పర్యటించిన ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను ఘనంగా పెట్టి తెలంగాణ సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. సాధించిన తెలంగాణ ను ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధి పదానికి నడిపించిన మహర్షి కేసీఆర్ అన్నారు. ఇక్కడ లేని విధంగా 24 గంటల కరెంటు తో పాటు 19 వేల కోట్లు రుణమాఫీ చేసి రైతుల మనసులలో చెరగని ముద్ర వేసుకున్నారు అన్నారు. కాంగ్రెస్ బిజెపి పార్టీలకు ఓటు వేసి గెలిపిస్తే తెలంగాణ పాలన ఢిల్లీ కి వెళ్తుందని, మరోసారి తెలంగాణ ప్రజలు ఢిల్లీ చేతుల్లో బానిసలు అవుతారని అన్నారు. అభివృద్ధి చెందిన రాష్ట్రం అంధకారంలోకి పోతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కొత్త మేనిఫెస్టో రూపొందించారని, మేనిఫెస్టోలో పేద ప్రజల అభ్యున్నతి కోసం మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఇందులో ముఖ్యంగా కెసిఆర్ ధీమా ఇంటింటికీ భీమా అని తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబంలో ఎవరైనా పోషకులు మరణిస్తే ఆ కుటుంబానికి ఈ పథకం ద్వారా ఐదు లక్షల రూపాయలు ఇవ్వనున్నామని అన్నారు. సౌభాగ్య లక్ష్మి పథకంతో ప్రతి మహిళకు నెలకు 3000 రూపాయాలు అందజేయనున్నామని, దీంతోపాటు గ్యాస్ సిలిండర్ ని కూడా కేవలం 400 కే అందజేస్తామన్నారు. అంతేకాకుండా అన్నపూర్ణ పేరిట తెల్ల రేషన్ కార్డు ఉన్న వారందరికీ సన్న బియ్యం ఇస్తామన్నారు. ఆరోగ్యశ్రీని కూడా ఐదు లక్షల నుంచి 15 లక్షలకు పెంచుతామన్నారు. పెన్షన్ కూడా దఫలవారీగా 5000 వరకు పెంచుతామని, వికలాంగుల పెన్షన్ కూడా 4000 నుంచి 6000 కు పెంచనున్నామన్నారు. బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలు పెట్టుకున్న అందరికీ కూడా ఎలక్షన్ అనంతరం చెక్కులు పంపిణీ చేస్తామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల కోసమే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ ల పథకాన్ని తీసుకొచ్చిందని, అసలు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకే గ్యారెంటీ లేదన్నారు. తెలంగాణ ప్రజలు చాలా తెలివైన వారు అందుకే కాంగ్రెస్ పార్టీని నమ్మడం లేదన్నారు. నన్ను గెలిపించిన వెంటనే వావిలాల ను మండలం చేసి చూపిస్తా అన్నారు. మీ దండం పెట్టి అడుగుతున్న హుజురాబాద్ నియోజకవర్గం అభివృద్ధి చేసుకోవాలంటే ఒక్క అవకాశం ఇవ్వాలంటూ కోరారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పింగళి రమేష్ ,నాగారం గ్రామ సర్పంచ్ రాజ్ కుమార్, ఎంపీటీసీ తిరుపతి రావు , నగురం గ్రామ సర్పంచ్ రాజేశ్వర్ రావు,లింగారావ్, వావిలాల ఎంపీటీసీ మర్రి మల్లేశం ,గ్రామ శాఖ అధ్యక్షుడు సంపత్, ప్రసాద్, పాపక్కపల్లి గ్రామ అధ్యక్షుడు భుజంగరావు, గ్రామ సర్పంచ్ మహేందర్లతో పాటు నాయకులు కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అమ్ముడుపోయిన నాయకులను ఊళ్ళలోకి రానివ్వకండి. బిఆర్ఎస్ పార్టీ కండువా మీద గెలిచి వేరే పార్టీకి వెళ్లిన నాయకులను ఊళ్ళ లోకి రాని వద్దని అన్నారు. జమ్మికుంట జడ్పిటిసి శ్రీరామ్ శ్యామ్ బిజెపికి కోట్ల రూపాయలకు అమ్ముడుపోయాడని అన్నారు. డబ్బులకు అమ్ముడుపోయిన నాయకుడు మీకు ఏ విధంగా సహాయపడతాడు మీరే ఆలోచించుకోవాలన్నారు. అలాంటి నాయకులు ప్రచారం కోసం మీ ఊర్లలోకి వస్తే చీపుర్లు తిరిగేయాలని అన్నారు. ఇప్పటికైనా ఇలాంటి నాయకులపై అప్రమత్తంగా ఉండి బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

## బీజేపీలో చేరిన జమ్మికుంట జడ్పీటీసీ శ్రీరామ్ శ్యామ్



**జమ్మికుంట నవంబర్ 04 (ప్రజామంటలు):** అధికార బీఆర్ఎస్ పార్టీకి వరుస షాకుల మీద షాకులు తగులుతున్నాయి. హుజురాబాద్ నియోజకవర్గంలో అధికార టిఆర్ఎస్ పార్టీలో గందరగోళ పరిస్థితి నెలకొంది. టిఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి వ్యవహార శైలి నచ్చక పార్టీ నుండి నాయకులు దూరం అవుతున్నారు. మాజీ జెడ్పిటిసి లు, మాజీ చైర్మన్లు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఇప్పుడు అధికార పార్టీ ప్రస్తుత జడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తూ మాజీ ఎమ్మెల్యే ధర్మారావు సమక్షంలో బిజెపిలో చేరి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు. అయితే బిజెపిలో చేరిన జడ్పిటిసి ని 'ప్రజామంటలు విలేకరి' వివరణ కోరగా కౌశిక్ రెడ్డి వ్యవహార శైలి నచ్చకనే, నికార్సైన ఉద్యమకారులమైన మేము ఉద్యమ ద్రోహి అయినా కౌశిక్ రెడ్డి వెంట తిరగడం ఆయన నియంత్రత్వ పోకడలు నచ్చక పార్టీని విడాల్సిన పరిస్థితి ఏర్పడ్డదని తెలిపాడు. టిఆర్ఎస్ పార్టీలో ఉద్యమకారులకు సముచిత స్థానం లేదు ఇప్పుడున్న బీఆర్ఎస్ పార్టీలో మొత్తం ఉద్యమ ద్రోహులకే అవకాశం ఉందని అక్కడ కెసిఆర్ ఇక్కడ కౌశిక్ రెడ్డి ఇద్దరూ దొరలేనని వీరి ఆధ్వర్యంలో పని చేయడం నచ్చకనే పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరానని తెలిపారు. కోట్ల రూపాయలకు అమ్ముడుపోయానని అంటున్న కౌశిక్ రెడ్డి ఉప ఎన్నికల టైం లో నువ్వు ఎన్ని కోట్లు తీసుకున్నావో ప్రజలకు తెలుసు అని అన్నాడు. అమ్ముడుపోయింది నువ్వు. వచ్చింది మా పార్టీకి మమ్మల్ని విమర్శించే అర్హత నీకు లేదని తెలిపాడు.

## జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కుమార్‌కి మద్దతుగా

### జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ఇంటింటి ప్రచారం



**జగిత్యాల నవంబర్ 04 (ప్రజామంటలు):** జగిత్యాల అర్బన్ మండల మోతే గ్రామంలో జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కుమార్ మద్దతుగా ఇంటింటా ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించిన జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్, ఎమ్మెల్యే కుమార్తె హార్దిక. వెంట బి.ఆర్.ఎస్. పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ రావు, జెడ్పీటీసీ మహేష్, సర్పంచ్ స్వప్న రాజేశ్వర్ రెడ్డి,రైతుబంధు మండల కన్వీనర్ జుంబర్తి శంకర్, గ్రామశాఖ అద్యక్షుడు చంద్రమౌళి, బి.అర్.ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు తుమ్మ గంగాధర్, మాజీ సర్పంచ్ రమాదేవి, అర్బన్ మండల యూత్ అద్యక్షుడు మతులాపురం శేఖర్, అర్బన్ మండల ఎస్.సి. సెల్ అధ్యక్షుడు సంగేపు ముత్తు, నాయకులు గంగమల్లయ్య, శ్రీను, గంగాధర్, మల్లేశం, వార్డ్ మెంబెర్లు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపెల్లి మండల బిజెపి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం






పాల్గొన్న బిజెపి అభ్యర్థి ఎస్. కుమార్

**గొల్లపల్లి నవంబర్ 04 (ప్రజామంటలు):** సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ నినాదంతో కార్మికులు, కర్షకులు, అట్టడుగు వర్గాల వారి అభ్యున్నతికి పాల్పడుతున్న మోదీ ప్రభుత్వం పట్ల యువత, రైతులు, పేదలు ఆకర్షితులవుతున్నారని, ఈ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గంతో పాటు, రాష్ట్రంలోనూ బిజెపి జెండా ఎగురవేయడం ఖాయమని బిజెపి అభ్యర్థి ఎస్. కుమార్ ధీమా వ్యక్తం చేశారు. గొల్లపెల్లి మండల కేంద్రంలో జరిగిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తలు, బూత్ కమిటీ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంఛార్జ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. హిందుత్వాన్ని నరనరాన జీర్ణించుకున్న బిజెపి, భావి భారత జాతి నిర్మాణం కోసం ఎంతో క్రమశిక్షణతో ముందుకెళుతుందని, ప్రత్యేక తెలంగాణ బిల్లు కు మద్దతు తెలిపి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు బిజెపి చేసిన కృషి మరిచిపోలేమని ఈ సందర్భంగా ఎస్. కుమార్ గుర్తు చేశారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ ఎస్ నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేదని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి ప్రజల్ని మోసం చేసిన పార్టీ కేసీఆర్ ప్రభుత్వమని ఎస్ కుమార్ దుయ్యబట్టారు. ఓ చేత్తో ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చి, మరో చేత్తో కోర్టులో కేసులో వేయించిన ఘనత బిఆర్ఎస్ దని ఆయర ఎద్దేవా చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రధానిగా మన ప్రధాని నరేంద్రమోదీ అని అనేక సర్వేలు తేల్చా చెప్పాయని, ఇంతవరకు ఎలాంటి అవినీతి, అక్రమాల మకిలి అంటని మన మోదీ పారదర్శక పాలన ప్రపంచ దేశాలకు ఆదర్శమని అన్నారు. చీటికీ మాటికీ పార్టీలు మారుతూ, రాజకీయ విలువలను తుంగలో తొక్కే నేతలున్న ఈ రోజుల్లో దాదాపు ఇరవై ఏళ్లుగా బిజెపి విధేయుడిగా ఉంటూ, ప్రజల విశ్వాసాన్ని చూరగొంటున్న తనకు వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి ధర్మపురి నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పంపించాలని ఎస్ కుమార్ కోరారు. చిత్తశుద్ధి, అంకితభావం గల నాయకులను చట్టసభల్లోకి పంపిస్తే భవిష్యత్ తరాలు బాగుపడతాయన్నారు. రైతులకు ఉచిత ఎరువులు, కిసాన్ యోజన పథకం ద్వారా ఆర్థిక సాయం, నిరుపేదలకు ఉజ్వల పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఆయస్మాన్ భారత్, ముద్రా యోజన తదితర పథకాలతో పాటు బేటీ బచావో-బేటీ పడావో, సుకన్య సమృద్ధి యోజన తదితర పథకాలతో మోదీ ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలకు ఎంతో దగ్గరయిందన్నారు. ఈసారి బిజెపిని గెలిపించి ప్రజలు ధర్మం పైపు నిలవాలని, బీసీ ప్రధానిగా ఉన్న బిజెపి పార్టీ రాష్ట్రంలోనూ బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించడం చారిత్రాత్మక అంశమని ఎస్ కుమార్ స్పష్టం చేశారు. ఏ పార్టీ కూడా బీసీ ముఖ్యమంత్రి అంశాన్ని తీసుకోకపోవడం శోచనీయమని, జాతీయ పార్టీగా, ప్రజల గుండెల నిండా బిజెపి నిండిపోయిందని, రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం నడుస్తుందని, రాబోయో ఎన్నికల్లో బిజెపి విజయం సాధించి తీరుతుందని ఎస్ కుమార్ స్పష్టం చేశారు. యువత, విద్యావంతులు ఈ దేశం కోసం, ఈ సమాజం కోసం ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి గొల్లపెల్లి మండల అధ్యక్షులు కట్ట మహేష్, అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, యస్సిమోర్చా రాష్ట్రకార్యదర్శి ఓరగంటి చంద్రశేఖర్ అసెంబ్లీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కొంద్ర మల్లారెడ్డి, యువమోర్చ కన్వీనర్ కొక్కు లక్ష్మన్ , బిజెపి దళితమోర్చ జిల్లా అధికార ప్రతినిధి బరిగెల భూమన్న , అసెంబ్లీ మహిళ మోర్చ కన్వీనర్ అంజలి మండల అధ్యక్షులు శిరీష తదితరులు పాల్గొన్నారు.

## త్రికూటేశ్వర ఆలయ చైర్మన్‌గా సురేందర్ రెడ్డి ఏకగ్రీవం



**భీమదేవరపల్లి నవంబర్ 04 (ప్రజామంటలు) :** మండలంలోని ముత్తారం గ్రామంలో అతి ప్రాచీన కాకతీయుల కట్టడం ప్రసిద్ధిగాంచిన త్రికూటేశ్వర ఆలయ చైర్మన్ గా ఏనుగు వెంకట సురేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా వనపర్తి రవీందర్, కోశాధికారిగా ఏనుగు ధర్మారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో తాను నిరంతరం కృషి చేస్తూ, సరస్వతి ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేస్తానన్నారు. అనంతరం కాశిరెడ్డి ఆదిరెడ్డి మాట్లాడుతూగత మూడు సంవత్సరాలలో శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని భక్తులకు అందుబాటులో తెచ్చి, మహాశివరాత్రి పర్వదినాన వేలాది మంది భక్తులు వచ్చేలా తమ కార్యవర్గం కృషిచేసిందని అన్నారు. అలాగే నూతన కార్యవర్గాన్ని స్వాగతిస్తూ, తాము ఎల్లవేళలా ఆ పరమశివుని సేవలో తమ వంతు సహకారం నూతన కార్యవర్గానికి అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఊరడి జయపాల్ రెడ్డి, మోకిడి వరుణ్, సింగిరెడ్డి రాజు రెడ్డి, ఏనుగు విజయ ప్రసాద్ రెడ్డి, వడ్డేపల్లి చక్రపాణి, ఇంగే తిరుపతి, అరవింద్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నలకు అండగా సీఎం కేసీఆర్

### సోలాపూర్ లో వస్త్ర పరిశ్రమల నిర్వాహకులు, కార్మికులతో సంభాషించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ నవంబర్ 04 (ప్రజా మంటలు):** దేశానికి తెలంగాణ మోడల్ దారిచూపుతోందని, సీఎం కేసీఆర్ పాలన దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. చేనేత కార్మికులకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం దేశంలో ఎక్కడా లేనన్ని కార్యక్రమాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. మహారాష్ట్రలో చేనేత కార్మికులు పడుతున్న బాధలు, కష్టాలు తీరాలంటే తెలంగాణ అభివృద్ధి నమూనానే ఏకైక పరిష్కారమని అభిప్రాయపడ్డారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ఇటీవల సోలాపూర్ కు వెళ్లిన కవిత అక్కడి వస్త్ర పరిశ్రమలను సందర్శించి వాటి నిర్వాహకులతో,కార్మికులతో సంభాషించారు. ఆ సంభాషణ సంబంధిత వీడియోను తన సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. మహారాష్ట్రలో వస్త్ర పరిశ్రమలతో పాటు ఇతర పరిశ్రమలకు నీటి కొరత, విద్యుత్తు కొరత చాలా తీవ్రంగా ఉందని, విద్యుత్తు చార్జీలు కూడా చాలా ఎక్కువగా ఉన్నాయని వారు కవిత దృష్టికి తీసుకొచ్చారు.మౌలిక సదుపాయాలు కూడా సరిగ్గా లేవని వారు చెప్పారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం వస్త్ర, చేనేత పరిశ్రమదారులు, కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వారు ప్రశంసించారు.ఈ సందర్భంగా వారితో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ....తెలంగాణలో పవర్ లూమ్ పరిశ్రమలకు సీఎం కేసీఆర్, రాష్ట్ర టెక్స్ టైల్ శాఖ మంత్రి కేటీఆర్ అనేక రాయితీలు కల్పిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల కోసం 10 శాతం నీటిని కేటాయించామని, దాంతో పరిశ్రమలకు అవసరమైన నీరు అందుతోందని అన్నారు. పరిశ్రమలకు నీటి కొరత, విద్యుత్తు కొరత లేకుండా . సీఎం కేసీఆర్ దూరదృష్టితో అనేక సంస్కరణలు చేపట్టారని వివరించారు. ఈ చర్యల వల్ల పరిశ్రమలు నడుపుతున్న వారికే కాకుండా అందులో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని, కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించగలిగామని స్పష్టం చేశారు. బతుకమ్మ చీరలను రాజకీయం చేసిన కాంగ్రెస్ పార్టీకి మహిళలు కర్రుకాల్చి వాతపెడుతారని అన్నారు.

## పేద ప్రజల కలలు సాకారం కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి

### హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్





**హుస్నాబాద్ నవంబర్ 04 (ప్రజామంటలు):** పేద ప్రజల కలలు సాకారం కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హుస్నాబాద్ టౌన్ లో పొన్నం విజయభేరి యాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో టౌన్‌లో కలియ తిరుగుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నెరవేర్చబోయే హామీలను, ఆరు గ్యారెంటీ కార్డు పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేస్తుందని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతినెల రూ. 2500 ఇవ్వడం జరుగుతుందన్నారు. రూ. 500 కే గ్యాస్ సిలిండర్ ఇవ్వబడు తుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరుగుతుందని తెలిపారు. రైతు భరోసా పథకం, గృహ జ్యోతి, యువ వికాసం పథకాల గూర్చి వివరించారు. పేద వాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షల సాయం చేస్తుందని తెలిపారు. వృద్ధులకు రూ. 4వేల చేయూత ఫించన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంపి గా గెలిపిస్తే పార్లమెంటులో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడానన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే హుస్నాబాద్ పేరును అసెంబ్లీలో మారుమోగించేలా చేస్తానని హామీ ఇచ్చారు. ప్రచార కార్యక్రమంలో పొన్నం తో పాటుగా పీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, డిసిసి కార్యదర్శి చిత్తారి రవి, హుస్నాబాద్ మండల అధ్యక్షులు బంక చందు, టౌన్ కౌన్సిలర్లు వల్లపు రాజు, చిత్తారి పద్మ, పున్న లావణ్య సది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వడ్డెర కాలనీలో పర్యటించిన జువ్వాడి కృష్ణారావు



**మల్లాపూర్ నవంబర్ 04 (ప్రజామంటలు):** మల్లాపూర్ మండల్ వేంపల్లి వెంకట్రావుపేట్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఎదురుగట్ల సుదర్శన్, గుమ్మల ఎర్రన్న కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ టిపిసిసి నాయకులు జువ్వాడి కృష్ణారావు. అనంతరం వడ్డెర కాలనీలో పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు కాలనీవాసులు ఇప్పటివరకు మాకు సీసీ రోడ్డు లేదు డ్రైనేజీ లేదు అని కృష్ణారావుకి తెలపగా జువ్వడి నర్సింగరావు ఎమ్మెల్యేగా గెలిచిన తక్షణమే మౌలిక సదుపాయాలలో భాగంగా డ్రైనేజీ సిసి రోడ్డు మొట్టమొదటగా మీ కాలనీలో చేయిస్తా అని కృష్ణారావు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోరుట్ల మాజీ జెడ్పిటిసి కొంతం రాజం, యువజన కాంగ్రెస్ మల్లాపూర్ మండల అధ్యక్షులు పోతు శేఖర్, గ్రామ శాఖ అధ్యక్షులు నానం రాకేష్ మండ్ల రాజారెడ్డి, ఎస్టి సెల్ అధ్యక్షులు గుగ్లావత్ రాజేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిట్టపల్లి జలపతి రెడ్డి, ఎండి రఫీ, జెసిబి భూమేష్, బజార్ మదన్, పన్నాల లక్ష్మారెడ్డి, అచ్చ శ్రీను, తిరుపతి, నిఖిల్, అజయ్, జి. నిఖిల్, నడిపి రాజం, పరమేష్, గుమ్మల లింగారెడ్డి, నంద రాజేందర్, సత్యనారాయణ, బాణావత్ గణేష్, బియ్యం నారాయణ, నయీమ్ భాయ్, ఎండి జమాల్, సామి, జి. శేఖర్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య పట్నంలో జువ్వాడి కృష్ణారావు ప్రచారం



**కోరుట్ల నవంబర్ 04 (ప్రజామంటలు):** కోరుట్ల నియోజకవర్గంలోని అయోధ్య పట్నంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జువ్వడి నరసింగరావు కు ఓటు వేసి గెలిపించాల్సిందిగా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువాడి కృష్ణారావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు ఈ ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టనున్న ఆరు గ్యారెంటీ పథకాల కార్డులను కృష్ణారావు పంపిణీ చేశారు కోరుట్లఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జువ్వడి నరసింగరావును గెలిపించాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వెంట కోరుట్ల పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ తదితరులు ఉన్నారు

## నేడే జ్యోతక్క సంస్మరణ సభ

### హాజరుకానున్న టీజేఏసీ చైర్మన్ ప్రో. కోదండరాం



**భీమదేవరపల్లి నవంబర్ 04 (ప్రజామంటలు):** తెలంగాణ ఉద్యమంలో మహిళా సారధిగా ముందుండి ఉద్యమాన్ని ఉధృతలూగించిన బహుజన ఉద్యమనేత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు చెప్పాల జ్యోతి సంతాప సభను నేడు వారి స్వగృహం ధర్మారంలో ఉ. 11 గం.లకు భీమదేవరపల్లి మండల జేఏసీ ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేసినట్లు జేఏసీ మండల చైర్మన్ డ్యాగల సారయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. పార్టీలకతీతంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అంగన్వాడి ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు, మహిళా సంఘాలు, దళిత సంఘాలు, కళాకారులు, ప్రజాసంఘాలు, జ్యోతి కుటుంబానికి ఆర్థికంగా సహకరించిన దాతలు ప్రజా ప్రతినిధులు అధికారులందరూ హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో చెప్పాల ప్రకాష్, రేణికుంట్ల బిక్షపతి, మాట్ల వెంకటస్వామి, కండే సుధాకర్, పొన్నాల వినోద్, ఉప్పుల కుమారస్వామి, మాడుగుల స్వామి, టేకుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా వరవర రావుకు కంటిశుక్లం శస్త్రచికిత్స

**హైదరాబాద్ నవంబర్ 04 (ప్రజామంటలు):** వరవర రావు ఆరోగ్య కారణాలతో బెయిల్ పొంది, కంటి పరీక్ష కోసం సరోజినీ దేవి కంటి ఆసుపత్రికి వచ్చారు. శనివారం సరోజినీ దేవి కంటి ఆసుపత్రిలో ఆయనకు కంటిశుక్లం శస్త్రచికిత్స జరిగింది. మల్టీఫోకల్ ఫోల్డబుల్ ఐఓఎల్‌తో ఫాకో సర్జరీ జరిగిందని సర్జన్ మరియు సూపరింటెండెంట్ డాక్టర్ వి రాజలింగం తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతమైంది. అతను కుట్టు తక్కువ సమయోచిత అనస్థీషియా కోసం బాగా సహకరించాడు మరియు అతనికి తగిన మందులు సూచించబడ్డాయి అని వివరించడం జరిగింది.




## ఎల్కతుర్తి మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం

### ఓపెనింగ్ చేసిన మండల ప్రెసిడెంట్ ఇంద్రసేనారెడ్డి



**ఎల్కతుర్తి నవంబర్ 04 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఎల్కతుర్తి గ్రామంలో ఓపెనింగ్ చేయడం జరిగినది. ఇందులో బావుపెట్ ఎంపీటీసీ ఎల్కతుర్తి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, మాజీ అధ్యక్షులు సుఖినే సంతాజి, ఎల్కతుర్తి మండలం మహిళా అధ్యక్షురాలు పిన్నింటి సుష్మా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గొర్రె మహేందర్, గోలి రాజేశ్వర రావు, బావు పెట్ సర్పంచ్ రాముడు, సీనియర్ నాయకులు పాక రమేష్, గొడిశల నరేష్, శీలం అనిల్, మహిళా నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి బియ్యం అందజేత

**భీమదేవరపల్లి నవంబర్ 04 (ప్రజామంటలు):** మండలంలోని ముల్కనూర్ గ్రామంలో ఇటీవల బుడిగ జంగాల కాలనీకి చెందిన సిరిగిరి వీరస్వామి అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. వారిలో ఒక అమ్మాయి, ఒక అబ్బాయికి అంగవైకల్యంతో ఇబ్బంది పడుతున్నారు. వీరి కుటుంబానికీ లయన్స్ క్లబ్ ఆఫ్ భీమదేవరపల్లి 30 కేజీల బియ్యం అందచేశారు. ఈ కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ కాశిరెడ్డి ఆదిరెడ్డి, ప్రెసిడెంట్ ఉప్పుల ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్ గుడికందుల కిశోర్, ప్రధాకార్యదర్శి మోర కుమార్, ఉడుత శ్రీనాథ్, తిరుపతి, శేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.




# కోరుట్లలో బిజెపి ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించిన ధర్మపురి అరవింద్

**కోరుట్ల నవంబర్ 04 (ప్రజామంటలు):** కోరుట్ల పట్టణంలో బిజెపి ఎన్నికల కార్యాలయాన్ని నిజామాబాద్ ఎంపీ, కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మపురి అరవింద్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసిఆర్ శుక్రవారం నాడు కోరుట్లకు ఆయారాం గయారాం అనే రీతిలో, ఎందుకు వచ్చాడో ఎందుకు వెళ్ళాడో అర్థం కావడం లేదన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, మౌళిక సదుపాయాలు, ఉద్యోగాలు, ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తదితర ప్రజా సమస్యలపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. స్థానిక కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నరసింగరావు గతంలో బీజేపీలో చేరతానని తనతో సంప్రదింపులు జరిపారని తెలిపారు. బిఆర్ఎస్ మద్దతుతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సుమారు 15 నుండి 20 మంది పోటీలో వున్నారని తెలిపారు. గెలుపొందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బిఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతారని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, కేసిఆర్ వ్యతిరేక ఓట్లు చీలకుండా చూడాలన్నారు. నరేంద్రమోడీ పాలనలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు దూసుకు పోతుందని తెలిపారు. స్థానిక సమస్యలు, రైతులు, బీడీ కార్మికుల సమస్యలు, యువతకు ఉద్యోగాలు తదితర సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాను గత ఎన్నికల్లో ఇచ్చిన పసుపు బోర్డ్ హామీని ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో నిబెట్టుకున్నానని తెలిపారు. గతంలో ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ తెరిపించాలని కోరుతూ ముత్యంపేట నుండి బోధన్ షుగర్ ఫ్యాక్టరీ వరకు 11 రోజుల పాటు పాదయాత్ర చేసినట్లు తెలిపారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మూతపడ్డ చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించి నడిపిస్తున్నామని అన్నారు. చెరుకు రైతులకు ప్రతి సంవత్సరం ఎంఎస్ పి పెంచుతూ వస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అత్యధికంగా చెరుకు పండించే కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలలో ప్రణాళిక బద్దంగా చెరుకు చక్కెర ఫ్యాక్టరీలు నడుపుతున్నామని తెలిపారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. కార్పొరేట్లు, కౌన్సిలర్లను కొనుక్కొని రాజకీయాలు చేయబోమని స్పష్టం చేశారు. గొర్లు మింగేటోడు కేసిఆర్ అయితే బర్లు మింగేటోడు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. తెలంగాణాలో కాంగ్రెస్ కు 40 సీట్లు కంటే ఎక్కువగా రావని జోస్యం చెప్పారు. తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తెలంగాణలో అభ్యర్థులను నిలబెట్టుకుండా పరోక్షంగా కాంగ్రెస్ కు సపోర్ట్ చేస్తున్నాడని ఆరోపించారు. అవాస్ యోజన పథకం ద్వారా 4 కోట్ల ఇండ్లు నిర్మించామని తెలిపారు. ఆయుష్మాన్ పథకం ద్వారా అరోగ్య భీమా 5 లక్షలు అమలు చేస్తున్నామని తెలిపారు. రేపో మాపో బిజెపి మేనిఫెస్టో విడుదల అవుతుందని అన్నారు. మేదిగడ్డ, అన్నారం, సుందిల్ల



ప్రాజెక్టుల ద్వారా 80 వేల కోట్ల రూపాయల వృధా అయ్యాయని ఆరోపించారు. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ లో మొత్తం 07 నియోజకవర్గాలలో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి మోడీ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని తెలిపారు. కొందరు నాయకులు ఎంపీ అరవింద్ ఢిల్లీలోనే వుంటారని విమర్శలు చేస్తున్నారని, ఎంపిలు ఢిల్లీలో కాకుండా గల్లీలో వుంటారా అని ప్రశ్నించారు. బిసిని ముఖ్యమంత్రిని చేస్తానని, అమిత్ షా ప్రకటించారని, బీసీలకు సామజిక న్యాయం బిజెపితోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మోరపెల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు దాసరి రాజశేఖర్, బీజేవైఎం అధ్యక్షులు కలల సాయి చందు, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం వేణుగోపాల్, ఇన్చార్జి యాదగిరి బాబు, పీసరి నర్సయ్య, తిరుమల వాసు, సుధావేణి మహేష్, పోతుగంటి శ్రీనివాస్, మొలుమురి మురళి, మెట్పల్లి అధ్యక్షులు బొడ్ల రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు మాడవేని నరేశ్, శీలం జయలక్ష్మి, అలేఖ్య రాజ్ మురళి, పే%శీ%డం గణేష్, దాసరి సునిత, పద్మ, స్వప్న, పూర్ణిమ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరు?

### అసలు ఉన్నారా! లేరా? బరిలో... అయోమయంలో బిజెపి క్యాడర్



**కథలాపూర్ /వేములవాడ నవంబర్ 04 (ప్రజామంటలు):** వేములవాడ నియోజకవర్గంలో బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరని అయోమయంలో పడ్డ బిజెపి అభిమానులు, కార్యకర్తలు వివరాల్లోకి వెళితే వేములవాడ నియోజకవర్గంలో ఇప్పటికీ బీజేపీ అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించకపోవడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అయోమయంలో పడ్డారు నామినేషన్లు వేసే సమయం వచ్చినా కానీ ఇంకా అభ్యర్థిని ప్రకటించకపోవడంతో అయోమ యంలో పడ్డ అభిమానులు కార్యకర్తలు. ఇదిలా ఉంటే బిజెపి కార్యకర్తలు కొంతమంది వేరే పార్టీ లోకి జంప్ చేసే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తుంది. దీన్ని అదునుగా తీసుకున్న ప్రతిపక్ష పార్టీ వాళ్లు బిజెపి బిఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుని అందుకే వేములవాడలో సీటు ప్రకటించడం లేదని,కాంగ్రెస్ వారు కూడా బిజెపితో పొత్తు పెట్టుకున్నారు ఆది శీను గెలుపు కోసమే బిజెపి అభ్యర్థిని ప్రకటించడం లేదని ఇరువర్గాల వారు ప్రచారం చేస్తున్నట్టు వినికిడి ఏది ఏమైనా బిజెపికి నమ్ముకున్న కార్యకర్తల పరిస్థితి దారం తెగిన గాలిపటం లా ఉందని ఇంకా 20 రోజులే ఉన్నందున బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించకపోవడంతో వేములవాడ లో బిజెపి బరిలో దిగదేమో అని ప్రజలు అనుకుంటున్నట్లు వినికిడి.

## ప్రజల దీవెనలతో మూడో సారి బీఆర్ఎస్ ప్రభుత్వం

### బన్సీలాల్ పేట లో మంత్రి తలసాని ప్రచారం



**సనత్ నగర్ నవంబర్ 04 (ప్రజామంటలు):** బండ మైసమ్మ నగర్ వాసుల బాధలు అన్నీ తీర్చిన నన్ను గెలిపించే బాధ్యత మీదేనని సనత్ నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన బన్సీలాల్ పేట డివిజన్ బీజేఆర్ నగర్, ముస్లీం బస్తీ, బండ మైసమ్మ నగర్ లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా బాబు జగ్జీవన్ రాం, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రచారంలో ప్రజలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఇండ్లు లేని పేదల కోసం లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టి 70 వేల ఇండ్లను అర్హులకు పంపిణీ చేశామని, మరో లక్ష ఇండ్లను నిర్మిస్తామని తెలిపారు.కానీ ప్రతిపక్ష పార్టీల నాయకులకు ఆ ఇండ్లు కనిపించకపోవడం విచారకరం అన్నారు. తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 400 రూపాయల కే గ్యాస్ సిలెండర్, రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా 15 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సేవలు అందించడం జరుగుతుందని చెప్పారు. మీ సమస్యలు అన్ని పరిష్కరించి అభివృద్ధి కి ఎంతో కృషి చేసిన తనను కారు గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మంత్రి వెంట ప్రచారంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ప్రేమ్, లక్ష్మీపతి, బలరాం, కెఎం కృష్ణ, రమణ, ఫహీం, అబ్బాస్, రజాక్, కుమార్ యాదవ్, జ్ఞాని, కమల్ కుమార్, సాయి, రాజేందర్, లంక రాజు, నాగభూషణం తదితరులు ఉన్నారు.

## ఇంటింటికి కేసీఆర్ మేనిఫెస్టో ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**మహాదేవపూర్ నవంబర్ 04 (ప్రజామంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో సర్పంచ్ శ్రీపతి బాపు ఆధ్వర్యంలో కెసిఆర్ మేనిఫెస్టో బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు కారు గుర్తు ప్రచారం జోరుగా సాగుతుంది మదన్న లాంటి నాయకుడు మన ఎమ్మెల్యే ఐతే అందుబాటులో ఉంటాడని తనదైన శైలిలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్ బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు అలిం ఖాన్, మహిళా విభాగం నియోజకవర్గ ఇంచార్జి కేదారి గీత, కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కుంభం పద్మ, సీనియర్ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లో కలికోట సూరమ్మ చెరువు పూర్తి చేస్తాం

### వేములవాడ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్

### బొమ్మెన తక్కళ్ళపల్లి గ్రామంల్లో గడప గడప కు కాంగ్రెస్

### మంగళహారతులతో ఘనస్వాగతం పలికిన మహిళలు

### కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు



**కథలాపూర్ నవంబర్ 04 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం బొమ్మెన,తక్కళ్ళపల్లి గ్రామాల్లో గడప గడప కు కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ కార్యక్రమనికి వేములవాడ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 30 నాడు ఎమ్మెల్యే ఎన్నికలు జరగబోతున్నాయి అని మీ అమూల్యమైన ఓటును మీ బీసీ బిడ్డగా వస్తున్న చేతి గుర్తుపై వేసి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు..పది సంవత్సరాలుగా వాళ్ళ చేతిలో అధికారంలో ఉన్నప్పటికీ కూడా అభివృద్ధి గురించి పట్టించుకోకుండా ఎన్నికలకు ముందే జిరాక్స్ పేపర్ చేతులు పెట్టి మోసం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. అధికారం ఉన్న లేకున్నా ప్రజల మధ్యలో మీ బిడ్డగా ఉన్నన్నారు. కలికోట సూరమ్మ చెరువు ప్రోజెక్టు చేసి దసరాకె నీళ్లు ఇస్తాం అని ఇప్పటి వరకు 6 దసరాలు పోయిన కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందన్నారు.. 37 సార్లు ధర్నా చేసిన కానీ ప్రభుత్వ పెద్దలకు ఏ మాత్రం చలనం లేదన్నారు. ఇక్కడి ప్రాంత సమస్యలు తెలిసిన వ్యక్తిగా మీ ముందుకు వస్తున్నానని, ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అన్నారు.

## అంతర్గత సమర్థత అభివృద్ధి కోసం శిక్షణ, అవగాహన

### సమావేశం నిర్వహించిన టిఎస్ఎన్పిడిఎల్ ఎస్ఈ జి. సత్యనారాయణ

**జగిత్యాల నవంబర్ 04 (ప్రజామంటలు):**



శనివారం టిఎస్ఎన్పిడిఎల్, జగిత్యాల లోని టౌన్ సబ్ డివిజన్, రూరల్ సబ్ డివిజన్ పరిధి లోని విద్యుత్ ఓఅండ్ఎం సిబ్బంది అంతర్గత సమర్థత అభివృద్ధి కోసం శిక్షణ మరియు విద్యుత్ సంస్థ అభివృద్ధి కోసం అవగాహనా సమావేశం నిర్వహించినారు. ఈ సమావేశంలో ఎస్ఈ, జి. సత్యనారాయణ మాట్లాడుతూ.... వినియోగదారుల విద్యుత్ సమస్యలు వెంటనే హాజరు కావాలని, విద్యుత్ బిల్లులు ఆన్లైన్లో చెల్లించేలా అవగాహనా కల్పించాలని, కాలి పోయిన, పాడైన మీటర్లను వెంటనే మార్చి సరి అయినా బిల్లులు అందచేయాలనీ, చెడిపోయిన ట్రాన్స్ఫార్మర్ లను వెంటనే మార్చి పంటలు ఏండి పోకుండా కాపాడాలని, విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొని పనులు చేయాలని, అలాగే వినియోగదారులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని, ట్రాన్స్ ఫార్మర్ లు కాలిపోకుండా లైన్లు పరిశీలించాలని, నిర్వహణ తరుచుగా చేయాలనీ సూచనలు చేశారు.స్టాఫ్ స్థానికముగా ఉండాలని, వినియోగదారులకు సేవలందిస్తూ సంస్థకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ఈ సమావేశంకు తిరుపతయ్య, ఎస్ ఏ ఓ, రాజిరెడ్డి, డిఈ, జగిత్యాల, ఏ.ఓ లు, ఏడి ఈ లు, ఏ ఈలు, ఏఏఓ లు, సబ్ ఇంజనీర్లు, సిబ్బంది ఉన్నారు.

## ధర్మారం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న 8 మంది అరెస్ట్

### రూ. 30,840 నగదు, 8 స్మార్ట్ ఫోన్స్, 6 బైక్స్ స్వాధీనం



**భీమదేవరపల్లి నవంబర్ 04 (ప్రజామంటలు):** మండలంలోని ధర్మారం గ్రామ సమీపాన పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపారు. పక్కా సమాచారం మేరకు శనివారం టాస్క్ ఫోర్స్ టీం, ముల్కనూరు పోలీస్ సిబ్బందితో దాడి చేసి వారిని పట్టుకుని, వారి నుండి రూ. 30,840 నగదు, 8 స్మార్ట్ ఫోన్స్, ఆరు బైక్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై చట్టరీత్యా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై సాయిబాబు మాట్లాడుతూ కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్ ఫోర్స్ తో దాడులు జరిపి 8 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వివరాలు తెలియజేస్తూ, పేకాట ఆడుతున్న ముల్కనూర్ గ్రామానికి చెందిన రాగిణి కుమారస్వామి, సిగసారపు సురేష్, ఎర్రబెల్లి గ్రామానికి చెందిన కాలేరు శంకరయ్య, దస్తరి రాజు, ఆతి కన్నయ్య, ధర్మారం గ్రామానికి చెందిన గుర్రపు వెంకన్న, రెడ్డి సమ్మయ్య, పాపు వెంకటేశ్వర్లు ఉన్నారని తెలిపారు.

## బీఆర్ఎస్ అభ్యర్థి వొడితల సతీష్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి



**ఎల్కతుర్తి నవంబర్ 04 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలంలోని దామెర, చింతలపల్లి, ఇందిరానగర్, గోపాలపూర్, పెంచికల్ పేట్, జీలుగుల, జగన్నాథపూర్ గ్రామాలలో బూత్ కమిటీల సమావేశంలో పాల్గొని బూత్ కమిటి సభ్యులకు దిశానిర్దేశం చేసిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు వొడితల ఇంద్రనీల్. ఈ సందర్భంగా ఇంద్రనీల్ మాట్లాడుతూ.... సీఎం కేసీఆర్ నాయకత్వం లోని బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు, నవంబర్ 30 వ తారీఖున జరిగే శాసనసభ ఎన్నికలలో కారు గుర్తుకు ఓటేసి హుస్నాబాద్ ఎమ్మెల్యేగా మూడవసారి సతీష్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ప్రతి గ్రామం ప్రగతి నివేదికను అలాగే 2023 బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.దేశంలో ఎక్కడా లేని విధంగా గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాగే ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ ఒక సైనికుడిలా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. పోలింగ్ బూత్ స్థాయిలో కార్యకర్తలను అప్రమత్తంగా ఉంచాలని, ఇంటింటి ప్రచారంలో భాగంగా ఓటర్లతో మమేకమై, మన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేయాలని సూచించారు. క్రమ శిక్షణ కలిగిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలన్నారు.ప్రత్యర్థి పార్టీల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తిప్పి కొట్టాలని, ఎవరికి ఎలాంటి అవకాశం ఇవ్వద్దని పేర్కొన్నారు. హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వొడితల సతీష్ కుమార్ గారిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అందుకోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని అన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థిగా అడ్లూరి నామినేషన్

**(రామ కిష్టయ్య సంగన భట్ల)**



**ధర్మపురి నవంబర్ 04 (ప్రజామంటలు):** ధర్మపురి శాసనసభ స్థాన గత సాధారణ, ఉప, రెండవ, మూడవ సాధారణ ఎన్నికలలో పోటీ చేసి ఓటమిపాలైన, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కాంగ్రెస్ అభ్యర్థిగా శనివారం నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జగిత్యాల అడిషనల్ కలెక్టర్ దివాకరకు అందజేశారు.

**తరలి వచ్చిన నేతలు:** ధర్మపురి శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్, కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం కాంగ్రెస్ నేత సింహరాజు ప్రసాద్ ప్రతిపాదిత సెట్లను ఆయన దాఖలు చేశారు. లక్ష్మణ్ కుమార్. నామినేషన్ కార్యక్రమంలో ఏడు మండలాలకు చెందిన కాంగ్రెస్ పదాధికారులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు తరలి వచ్చారు.

**భారీ జనసమీకరణ:** శనివారం కాంగ్రెస్ అభ్యర్థిగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నామినేషన్ దాఖలు చేసిన అనంతరం భారీ సంఖ్యలో జన సమీకరణ గావించి భారీ జనంతో ఆడం బరంగా, అట్టహాసంగా ర్యాలీ నిర్వహించారు. వేలాదిమంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులూ కదలి రాగా, ర్యాలీ నిర్వహించారు.

**లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పూజలు:** ధర్మపురి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగిత్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తన ఎన్నికల నామినేషన్ దాఖలు చేయదానికి ముందు నియోజక వర్గ నాయకులు కార్యకర్తలతో కలిసి శ్రీ లక్ష్మినరసింహ స్వామి వారిని దర్శించు కొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి వర్యులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, లక్ష్మణ్ కుమార్ లు కార్యకర్తలతో కలిసి అంబెడ్కర్ చౌరస్తా, నంది కూడలి, గాంధీ కూడలి మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. నంది విగ్రహ కూడలి వద్ద జీవన్ రెడ్డి, లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..ధర్మపురి క్షేత్రానికి 500 కోట్ల రూపాయలు ఇస్తానన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన ఏమైందని, పైగా కాంగ్రెస్ నాయకులు చేసిన అభివృద్ధి ఏమి లేదని ముఖ్యమంత్రి చెప్పడం బాధా కరమని, కాళేశ్వరం లింక్ 2 కింద 700 వందల ఎకరాల భూమిని బలవంతంగా లాకున్న, ఎల్లంపెల్లి ప్రాజెక్ట్ భునిర్వసితులకు పరిహారం అందించడంలో మంత్రి కనీసం స్పందించలేదని, తలాపున గోదావరి ఉన్న ధర్మపురి ప్రాంత ప్రజలకు తాగడానికి నీళ్లందని పరిస్థితి నెలకొందని, ధర్మపురిలో ఒక పాలిటెక్నిక్ కళాశాల గాని, ఐటీఐ కళాశాల గాని లేవని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు నెలలలోగా ధర్మపురిలో ఉన్న సమస్యలన్నిటిని పరిష్కరిస్తామని, తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని, ధర్మపురి లో ఒక బస్ డిపోను ఏర్పాటు చేస్తామని, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ధర్మపురి ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# రాఘవపట్నంలో నిర్వహించిన భారీ ర్యాలీ

### గుండు హనుమన్ దేవాలయంలో ముడుపులు కడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

### ప్రజా ఆశీర్వాద యాత్రలో మంత్రి కొప్పుల ఈశ్వర్







**గొల్లపల్లి నవంబర్ 04 (ప్రజామంటలు):** పదేళ్ల బిఆర్ఎస్ పాలన కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన తీరును చూసి , సబ్బండ వర్గాల ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో అమలు ప్రజాసంక్షేమ పథకాలను చూసి జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి పట్టం కట్టాలని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం గొల్లపల్లి మండలం రాఘవపట్నం, గంగాదేవిపల్లె ,శంకర్రావుపేట, మల్లన్నపేట , వెంగలాపూర్ గ్రామాల్లో మంత్రి ఆశీర్వాద యాత్రను నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మంత్రికి స్థానిక బిఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు బతుకమ్మలు, డప్పు చప్పులతో ఘన స్వాగతం పలికారు. ప్రతి గ్రామంలో మంత్రికి ప్రజల నుంచి భారి స్పందన లభించింది .ఆయా గ్రామాల్లో మంత్రి పార్టీ శ్రేణులతో కలిసి గడపగడప తిరుగుతూ ప్రజలను పలకరిస్తూ , వారి ప్రజా సమస్యలను వింటూ ముందుకు కదిలారు. గ్రామాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు ఆయా గ్రామాలు గులాబీమయమయ్యాయి .అనంతరం రాఘవపట్నం గ్రామ రెవెన్యూ శివారులోని గుండు హనుమాన్ దేవాలయంలో తనను ఎమ్మెల్యేగా మరోసారి హ్యాట్రిక్ విజయం అందేలా చూడాలని కోరుతూ అంజన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపులు కట్టారు .ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ ఆరవై ఏళ్ళ కాంగ్రెస్ పాలనలో దేశానికి ,రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని ఇప్పుడు వచ్చి ఏదో చేస్తామని చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మవద్దన్నారు .కాంగ్రెస్,బిజెపి పార్టీలు అధికార దాహంతో తల్లడిల్లుతున్నాయని ,వారికి అధికారం అప్పచెప్పితే అందిన కాడికి దోచుకుంటారే తప్ప అభివృద్ధిని ,ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోరని ఆరోపించారు. అదే బిఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు ఎప్పటి మాదిరి 24 గంటల విద్యుత్ సరఫరాతో పాటు ప్రస్తుతం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు నిరంతరాయంగా అమలు అవుతాయన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపించాలని ఓటర్లను ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ ఫోరం జిల్లా చైర్మన్ డా. రాజసుమన్ రావు, ఎంపీపీ శంకరయ్య,వైస్ ఎంపిపి సత్తయ్య, ఏఎంసి చైర్మన్ హనుమండ్లు, వైస్ చైర్మన్ లింగారెడ్డి, సర్పంచుల ఫోరం మండల శాఖ అధ్యక్షుడు రమేష్, బిఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు రమేష్, ఆయా గ్రామాల సర్పంచులు శంకరయ్య, ఉప సర్పంచ్ అంజి, సుజాత, రాజ్ కుమార్, నర్సయ్య,రమ్య, ఎంపీటీసీలు మధుకర్ రెడ్డి, లక్ష్మీగంగారెడ్డి, రాజన్న, బుర్ర తిరుపతి వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శాసనసభ ఎన్నికల్లో నలుగురు గల్ఫ్ సంఘాల నేతలు

### ముగ్గురికి సింహం గుర్తు ఒకరు ఇండిపెండెంట్

**(రామ కిష్టయ్య సంగన భట్ల)**









**ధర్మపురి నవంబర్ 04 (ప్రజామంటలు):** సారనాథ్ లోని అశోకుని స్థూపం లోని నాలుగు సింహాల స్ఫూర్తిగా... నేతాజీ సుభాష్ చంద్ర బోస్ స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఆజాద్ హింద్ ఫౌజ్) ఇచ్చిన ధైర్య సాహసాలతో రాబోయే తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో నలుగురు గల్ఫ్ సంఘాల నాయకులు పోటీ చేస్తున్నారు. అశోకుని సారనాథ్ స్థూపంలో నాలుగు సింహాలు వీపు వీపు కలుపుకుని వృత్తాకారంలో నిలుచుండి ముందుకు చూస్తూ ఉంటాయి. వెనుకవైపు ఉన్న నాలుగో సింహాన్ని చూడలేము. నాలుగు సింహాలు నాలుగు లక్షణాలను పవర్ (శక్తి / అధికారం), కరేజ్ (ధైర్యం), కాన్ఫిడెన్స్ (విశ్వాసం), ఫేత్ (నమ్మకం) ను సూచిస్తాయి. భారత స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ స్థాపించిన ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థులుగా గుగ్గిల్ల రవిగౌడ్ (వేములవాడ), చెన్నమనేని శ్రీనివాస్ రావు (కోరుట్ల), స్వదేశ్ పరికిపండ్ల (నిర్మల్) ముగ్గురు ఇప్పటికే బీ-ఫారాలు పొంది సింహం గుర్తుతో అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్నారు. సిరిసిల్ల నుంచి క్రిష్ణ దొనికెని అభ్యర్థిత్వాన్ని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పరిశీలిస్తోంది. కాగా కొన్ని సమీకరణాల వలన టికెట్ ను పార్టీ అధిష్టానం పెండింగ్ లో ఉంచింది. టికెట్ వచ్చినా రాకున్నా సిరిసిల్ల నుంచి క్రిష్ణ దొనికెని ఇండిపెండెంట్ గా కనిపించని నాలుగో సింహం వలె రంగంలో నిలవడం ఖాయం అని గల్ఫ్ సంఘాల ప్రతినిధులు తెలిపారు.

## జీవితం సవ్యంగా సాగేందుకు సైన్స్ చాల దోహద పడుతుంది

### జిల్లా విద్యాధికారి డా. జగన్ మోహన్ రెడ్డి



**జగిత్యాల నవంబర్ 04 (ప్రజామంటలు):** మన జీవనం సాఫీగా జరుగుటకు సైన్స్ బాగా దోహద పడితున్నదని ప్రకృతి నూతన ఆవిష్కరణలకు దోహదం అవుతుందని విద్యార్థి దశ నుండే ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందని, సైన్స్ కాంగ్రెస్, ఇన్స్పైర్ అవార్డ్స్ ,జవహర్ లాల్ నెహ్రూ సైన్స్ ఫెయిర్ లలో పలు రకాలైన ప్రదర్శనలలో పాల్గొని శాస్త్రీయ వైఖరులు, దృక్పథాన్ని పెంచుకోవాలని సూచించారు. 31 వ జాతీయ బాలల కాంగ్రెస్, జగిత్యాల జిల్లా ప్రాజెక్టుల ప్రదర్శన శనివారం ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాల లో ఆరోగ్యం ,శ్రేయస్సు కోసం పర్యా వరణ వ్యవస్థ ను అర్థం చేసువడం ప్రధాన అంశంగా జరిగిన ప్రదర్శన లో జిల్లా విద్యాధికారి డాక్టర్ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శణలో అయిదు ఉప అంశాల నుండి జగిత్యాల పట్టణంలోని మానస హై స్కూల్ నుండి బొడ్డుపల్లి రిషిత, పి. అక్షయ. జ్యోతి హైస్కూల్ నుండి బరీరహ అర్మీన్, ఎం. సాధ్వి. ప్రజ్ఞ గ్లోబల్ స్కూల్ నుండి కె. అనన్య, జి మానస. గౌతమ హై స్కూల్ నుండి ఎండి సుఫ్యానుద్దిన్, జి శ్రీరామ్. మౌంట్ కార్మెల్ స్కూల్ నుండిపి గున ఆదిత్య, ఎండి అక్విబ్. కోరుట్ల నవజ్యోతి స్కూల్ నుండి జి. స్రవంతి, కె. దీక్షితలు రాష్ట్ర స్థాయి ప్రదర్శనలు ఎంపిక కాగా విద్యార్థులకు ప్రశంస పత్రలను అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా జి చంద్రయ్య , పడాల తిరుపతి, డి. నాగభూషణంలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు చంద్రకళ, జిల్లా సైన్స్ అధికారి, కోఆర్డినేటర్ బాజొజి శ్రీనివాస్, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ మచ్చ రాజశేఖర్, పాఠశాల అటల్ టింకెరింగ్ లాబ్ ఇంఛార్జి ఆనంద రావు, రిసోర్స్ పర్సన్స్ గా పెద్ది రాజు, బి. శ్రీనివాస్, రవీష్ లు పాల్గొన్నారు.

## 'నేను సైతం... మీ విజయం కోసం..'

### జీవన్ రెడ్డి కి రు.10 వేలు విరాళం ఇచ్చిన వీరాభిమాని..



**జగిత్యాల నవంబర్ 04 (ప్రజామంటలు):** 'నేను సైతం మీ విజయం కోసం' అంటూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్ రెడ్డి ఎన్నికల ఖర్చు కోసం జగిత్యాల అర్బన్ మండలం తిమ్మాపూర్ కు చెందిన జీవన్ రెడ్డి వీరాభిమాని అలిశెట్టి అజయ్ శనివారం జీవన్ రెడ్డి ని ఆయన ఇంట్లో కలిసి రు.10,000 విరాళం అందజేశారు. తన వంతు ఉడతాభక్తిగా ఎన్నికల కోసం అందజేశానని, జీవన్ రెడ్డి కోసం విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. జీవన్ రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

### ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి..



**జగిత్యాల నవంబర్ 04 (ప్రజామంటలు):** ఎన్ఆర్ఐ సెల్ జగిత్యాల జిల్లా, మండలాల అధ్యక్షులను నియమించిన టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ చాంద్ పాషా.. నియామక ఉత్తర్వులు అందజేసిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. టీపీసీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ కుమార్ ఆదేశాల మేరకు టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ చాంద్ పాషా ఎన్ఆర్ఐ సెల్ జగిత్యాల జిల్లా, జగిత్యాల పట్టణ, సారంగా పూర్, ధర్మపురి, మండలాల అధ్యక్షులను నియమించగా, జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి శనివారం నియామక పత్రాలు అందజేశారు. జగిత్యాల జిల్లా ఎన్ ఆర్ ఐ సెల్ జిల్లా అద్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి షకీల్, జగిత్యాల పట్టణ ఎన్ఆర్ఐ సెల్ అద్యక్షుడు ఎం.డి రఫీక్, సారంగా పూర్ మండలం ఎన్ ఆర్ ఐ సెల్ అధ్యక్షుడిగా మల్లేశం, ధర్మపురి ఎన్ ఆర్ ఐ సెల్ అద్యక్షుడు అలకుంట సాంబయ్యలకు నియామక పత్రాలు అందజేశారు. జీవన్ రెడ్డి కి మద్దతు తెలిపేందుకు వచ్చిన గల్ఫ్ కార్మికులతో జీవన్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గల్ఫ్ కుటుంబాలకు అండగా ఉంటుందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి గల్ఫ్ లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రు.5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని అన్నారు. ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించడం హర్షం వ్యక్తం చేస్తూ, తమ మద్దతు కాంగ్రెస్ కేనని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి అజయ్ ను అభినందించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు.

## ఘనంగా శ్రీతుల్జా భవానీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

### ప్రత్యేక పూజల్లో మంత్రి తలసాని



**సనత్ నగర్ నవంబర్ 04 (ప్రజామంటలు):** బన్సీలాల్ పేట డివిజన్ ఐడీహెచ్ కాలనీలో శ్రీతుల్జా భవానీ దేవాలయంలో శనివారం శ్రీతుల్జా భవానీ అమ్మవారి విగ్రమా ప్రతిష్ట వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులతో ఆలయంలో బలిపీఠము, పోత లింగము, నాగదేవత లను ప్రతిష్ట చేశారు. దేవాలయ పునర్నిర్మాణ దాత రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, సికింద్రాబాద్ బీఆర్ఎస్ పార్లమెంటరీ ఇంచార్జ్ తలసాని సాయి కిరణ్ యాదవ్ లు ఈ వేడుకల్లో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. తన స్వంత నిధులతో శ్రీతుల్జాభవానీ దేవాలయ పునర్నిర్మాణం చేసిన దాత మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ కు ఆలయ నిర్వాహకులు కృతజ్ఞతలు చెప్పి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ ఎల్.వెంకటేశన్ రాజు, ఆలయ ఫౌండర్ ప్రెసిడెంట్ శెట్ల అంబిక, జనరల్ సెక్రటరీ రజనీష్, నాయకులు దుర్గా, కౌసల్య, వాసవి, మిట్టపల్లి శ్రీనివాస్, మహేశ్, భక్తులు పాల్గొన్నారు.

## మేడిగడ్డ బ్యారేజ్ ని సందర్శించిన బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**మహాదేవపూర్ నవంబర్ 04 (ప్రజామంటలు):** మహాదేవపూర్ హైదరాబాద్ నుండి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా బిజెపి నేతలు కేంద్రమంత్రి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ఈటెల రాజేందర్ రఘునందన్ రావు లతో కలిసి మేడిగడ్డకు చేరుకొని కాళేశ్వరం ప్రాజెక్టు లోని కీలకమైన మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్ దెబ్బతిన్న పిల్లర్లను పరిశీలించి ఆరా తీశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.... బిఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు కాళేశ్వరం ప్రాజెక్టు ఫెయిల్యూర్ అని ప్రాజెక్టు నిర్మాణంతో లక్షల కోట్లు ప్రజాధనం దుర్వినియోగం చేశారని దీనికి పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి కేసీఆర్ వహించాలని అన్నారు 80 వేల పుస్తకాలు చదివిన అతి తెలివి అవినీతి ముఖ్యమంత్రి యొక్క దుందురుకుతనం ఏకపక్ష నిర్ణయాల కారణంగా చాలా నష్టం జరిగిందని అన్నారు ప్రజలపై గౌరవం ఉంటే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి సిబిఐతో విచారణకు ముందుకు రావాలి న్యాయ విచారణకు అంగీకరిస్తుందా ముఖ్యమంత్రి ప్రజలకు చెప్పాలన్నారు. మేడిగడ్డ లాగానే అన్నారం బ్యారేజీ పరిస్థితి అలానే ఉందని బ్యారేజ్ లో 10 టీఎంసీల నీరు సామర్థ్యం ఉండగా ఒక్క టీఎంసీ నీరు కూడా నిల్వచేసే పరిస్థితులు లేవని అన్నారు. ఇందుకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## 27వ వార్డులో డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి సతీమణి నీలిమ ప్రచారం



**జనగామ నవంబర్ 04 (ప్రజామంటలు):** జనగామ పట్టణం 27వ వార్డులో డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి సతీమణి నీలిమ ప్రచారానికి పట్టణ మహిళా అధ్యక్షురాలు చెంచారపు పల్లవి సోమిరెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి వార్డు అధ్యక్షులు కావ్య, పట్టణ సెక్రెటరీ జైన రమేష్, మొగుళ్లపల్లి బిక్షపతి, పూర్ణచందర్, నందీశ్వర్ గ వివిధ వార్డుల కౌన్సిలర్స్ అధ్యక్షులు స్వాగతం పలికారు. ప్రజలు అందరు కూడా మేము కారు గుర్తుకు ఓటు వేసి పల్లా రాజేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ను చేస్తామని, ప్రజలు ప్రతి ఒక్కరు ఇంటికి మంగళ హారతులు పలికారు.

## కొమ్మూరి గెలుపు కోసం కృషి చేయాలి



**జనగామ నవంబర్ 04 (ప్రజామంటలు):** జనగామ మండలం ఎర్రగుంట తండ, కళ్యాణి నగర్‌లో జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి గెలుపు కోసం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసుకొని కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి తీసుకోవ డానికి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను గడప గడపకు ప్రచారం నిర్వహించారు. జనగామ మండలం నుంచి అత్యధిక మెజారిటీతో కొమ్మూరి ప్రతాప్ రెడ్డి గెలుపు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా నాయకులు కొత్త కరుణాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ధర్మ గోవర్ధన్ రెడ్డి,జిల్లా కార్యదర్శి వడ్లకొండ రాజీరెడ్డి, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు బడికె కృష్ణస్వామి లింగాల నర్సిరెడ్డి, ఎంపీటీసీ బాలరాజు గౌడ్, షామీర్పేట మాజీ ఎంపీటీసీ గనిపాక మహేందర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు కట్ట కృష్ణ, శ్రీధర్ రెడ్డి, దాసరి శేఖర్, గుజ్జుల మధు, నరేష్, ఎర్రగుంట గ్రామ అధ్యక్షులు శ్రీకాంత్, రజినీ, నర్సిరెడ్డి, గోపాల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAG-TIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com